**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

లింగరూపధారి భంగముల్ కళ్గినా
చేరిమనలగాచు చిత్రముగను
హరహరయని పలికి హారతులీయగా
పాపములనుబాపు పాపహరుడు

మీ
విజయప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644



**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



సంచిక : 337 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 03-04-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00




## సన్‌రైజర్స్ పవర్ పంచ్


- 65 రన్స్ తేడాతో కోల్‌కతాపై విజయం
- నితీశ్ ఆల్‌రౌండ్‌షో
- చెలరేగిన క్లాసెన్, అభిషేక్, హెడ్
- ఉనాద్కట్‌కు మూడు వికెట్లు

కోల్‌కతా

ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన ఐపిఎల్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు 65 పరుగుల తేడాతో ఘన విజయం సాధిం చింది. తొలుత ఓపెనర్లు అభిషేక్ శర్మ(48; 21బంతుల్లో 4ఫోర్లు, 4సిక్సర్లు), హెడ్(46; 21బంతుల్లో 6ఫోర్లు, 3సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్‌కి తోడు క్లాసెన్(52) అర్ధసెంచరీతో రాణించడంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 226 పరుగుల -మిగతా 2 లో

## గాజాలో శైశవయాత్ర!

2




### కాళేశ్వర జలాలు చూపిస్తం..

# వచ్చే దమ్ముందా!

### కిషన్‌రెడ్డి వ్యాఖ్యలకు హరీశ్‌రావు కౌంటర్

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి హరీశ్‌రావు సవాల్
- మీ వ్యాఖ్యలే కాంగ్రెస్, బీజేపీ పొత్తుకు సాక్ష్యం
- ఆర్థిక సర్వే రిపోర్టు మీ కండ్లకు కనిపించదా?
- గడ్కరీ,సీడబ్ల్యూసీ చైర్మన్ ప్రశంసలు అబద్ధమా?
- ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపి తెలంగాణకు ద్రోహం చేసింది బీజేపీయే



**హైదరాబాద్, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
: కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్, బీజేపీ మధ్య చీకటి పొత్తుకు సాక్ష్యమని బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే కిషన్‌రెడ్డి కొనసాగిం చారని దుయ్యబట్టారు. 'ప్రపంచంలోనే అతి పెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టుగా కాళేశ్వరాన్ని నిర్మించడం అబద్ధమా? 148 మీటర్ల దిగువ ప్రాంతం నుంచి 618 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయడం అబద్ధమా? ఈ రోజు, ఈ నిమిషానికి మండుటెం డల్లో సైతం కాళేశ్వరం ప్రాజెక్ట్ కాలువల ద్వారా జలాలు రైతుల పొలాలకు చేరుతుండటం అబద్ధ మా? ఏది అబద్ధం కిషన్‌రెడ్డీ? పంట పొలాల్లో పారుతున్న కాళేశ్వరం జలాలను చూపించేందుకు నేను సిద్ధం. మరి వచ్చేందుకు మీకు దమ్ముందా?' అని హరీశ్‌రావు సవాల్ విసిరారు. 'మీరు క్యాబినెట్ మంత్రిగా ఉన్నారుఏ ప్రభుత్వమైనా ప్రజాధనం తోనే నిర్మాణాలు చేస్తుందన్న విషయం -మిగతా 2 లో



## 53 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెర

- 53 సంవత్సరాల తర్వాత మళ్లీ చంద్రుడి చెంతకు!
- అమెరికన్ల జాబిల్లి యాత్ర ప్రారంభం
- నాసా ఆర్టెమిస్-2 విజయవంతం
- చంద్రుడి వద్దకు ఓరియన్ రాకెట్

న్యూయార్క్

అంతరిక్ష పరిశోధనల్లో మరో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. 53 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ మానవుడు మళ్లీ చంద్రుడి వద్దకు పయనమయ్యాడు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రమండల యాత్ర 'ఆర్టెమిస్-2' దిగ్విజయంగా ప్రారంభమైంది. గురువారం తెల్లవారుజామున 4.06 నిమిషాలకు ఈ ప్రయోగం మొదలైంది. ఈ ప్రాజెక్టులో భాగంగా నలుగురు వ్యోమగాములు చంద్రుడి సమీపానికి వెళ్లి పరిశోధనలు చేయనున్నారు. నలుగురు -మిగతా 2 లో



## నిర్భయంగా ఓటేయండి..

- టీఎంసీని బంగాళాఖాతంలో కలపండి..
- బెంగాల్ ప్రజలకు అమిత్ షా పిలుపు

న్యూఢిల్లీ

పశ్చిమ బెంగాల్ ప్రజలందరూ నిర్భయంగా ఓటేయాలని, అధికార టీఎంసీని బంగాళాఖాతంలో కలపాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాజధాని కోల్‌కతాలో బీజేపీ గురువారం నిర్వహించిన ర్యాలీలో షా ప్రసంగించారు. ఈ సందర్భంగా అధికార టీఎంసీపై, సీఎం మమతా బెనర్జీపై కీలక వ్యాఖ్యలు చేశారు. టీఎంసీ గూండాలకు ఈసారి ఓటర్లు ఎవరూ -మిగతా 2 లో


## భారత్‌కు ఇజ్రాయిల్ లైట్ మెషిన్ గన్స్

- అదానీ గ్రూప్, ఐడబ్ల్యూఐల సంయుక్త సంస్థల మధ్య డీల్ కోసమే మోడీ టూర్ ?
- 'మేక్ ఇన్ ఇండియా' పేరిట సాంకేతికత బదిలీ
- 41వేల తుపాకులకు కుదిరిన భారీ ఒప్పందం

న్యూఢిల్లీ

భారత్- ఇజ్రాయిల్ రక్షణ ఒప్పందాలు సజావుగా సాగుతున్నాయి. 'మేక్ ఇన్ ఇండియా'లో భాగంగా ఇజ్రాయిల్‌కు చెందిన ఒక ప్రముఖ ఆయుధాల తయారీ సంస్థ తేలికపాటి మెషిన్ గన్ (ఎల్ఎంజీ )లను భారత్‌కు సరఫరా చేసింది. భారత్, ఇజ్రాయిల్ మధ్య 41వేల తుపాకులకు సంబంధించి భారీ ఒప్పందం కుదిరింది. అయితే తొలివిడతలో భాగంగా గత వారాంతంలో 2వేల -మిగతా 2 లో






## అమరావతికి ఆమోదముద్ర

- రాజ్యసభలోనూ ఏకగ్రీవం
- బిల్లును రాష్ట్రపతికి పంపనున్న కేంద్రం
- రాష్ట్రపతి సంతకంతో గెజిట్ విడుదల

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ అమరావతి బిల్లుకు ఉభయ సభలు ఏకగ్రీవ ఆమోదం తెలిపాయి. అనంతరం ఈ బిల్లును కేంద్రం.. రాష్ట్రపతికి పంపనుంది. ఈ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేసిన తర్వాత గెజిట్ నోటిఫికేషన్ విడుదలకానుంది. దీంతో ఏపీ ఏకైక రాజధానిగా అమరావతి అమల్లోకి రానుంది. ఈ బిల్లు రాజ్యసభలో గురువారం ఆమోదం పొందడంతో.. -మిగతా 2 లో



## ఢిల్లీలో దోస్తీ.. రాష్ట్రంలో కుస్తీ!..

- ఇండియా కూటమి పార్టీల తీరు
- లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ
- అసెంబ్లీ ఎన్నికల్లో ముఖాముఖీ ఢీ

న్యూఢిల్లీ

కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్న ధ్యేయంతో ఏర్పడిన ఇండియా కూటమి అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్టు వ్యవహరిస్తున్నది. ఢిల్లీ నుంచి మహారాష్ట్ర ఎన్నికల వరకు ఇదే తీరు. పిల్లీ పిల్లీ కొట్టుకుని కోతికి అప్పగించినట్టు కూటమిలో ఐక్యత లేమి బీజేపీకి వరంలా మారుతున్నది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్న ఏకైక లక్ష్యంతో 2023లో దేశంలోని 26 విపక్ష పార్టీలు కలిసి ఇండియా కూటమిని ఏర్పాటు చేసుకున్నాయి. అయితే ఈ కూటమి బీజేపీని దెబ్బతియడం మాత్రం దేవుడెరుగు, అసలు నిలబడగలదా? అని చాలా మంది సందేహపడ్డారు. అయితే ఈ కూటమి తన లక్ష్యాన్ని చేరుకోలేకపోయినా అధికార బీజేపీని మాత్రం దెబ్బతీసిందని చెప్పవచ్చు. 2024 లోక్‌సభ -మిగతా 2 లో

### భూభారతితో భూవ్యవస్థలో

# సమూల మార్పులు





- జిల్లాకో మండలంలో భూభారతి అమలు
- ప్రతి జిల్లాలో 70 గ్రామాల్లో సర్వే
- ప్రతి సర్వే నెంబరుకు భూధార్ కేటాయింపు
- సాదాబైనామాల సమస్యలకు పరిష్కారం
- ఆధునిక రోవర్ యంత్రాలతో సర్వే
- ప్రతి మండలానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లు
- ఆమనగల్లు వార్డు సభలో మంత్రి పొంగులేటి వ్యాఖ్యలు

**ఆమనగల్, ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
రాష్ట్రంలో భూవ్యవస్థను పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చేందుకు ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను 45 రోజుల పాటు పరిశీలించిన అనంతరం అవసరమైన మార్పులు చేర్పులతో జిల్లాకో మండలంలో అమలు చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.రంగారెడ్డి జిల్లా ఆమనగల్ మండలంలోని విఠాయిపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన వార్డు సభలో మంత్రి ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెవెన్యూ శాఖలో విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఆమనగల్ మండలంతో పాటు ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, నారాయణపేట జిల్లా కొస్గి మండలాల్లో ఈ పోర్టల్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నట్లు వివరించారు.ఇకపై పేదలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా తమ చేతిలోని స్మార్ట్‌ఫోన్ ద్వారా భూభారతి పోర్టల్‌లో లాగిన్ అయితే అన్ని సేవలు పొందే విధంగా ఈ వ్యవస్థను రూపొందించామని తెలిపారు. గత ప్రభుత్వ కాలంలో ప్రవేశపెట్టిన ధరణి కారణంగా రాష్ట్రంలో లక్షల సంఖ్యలో సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. సాగు చేస్తూ భూమిని అధీనంలో ఉంచుకున్న రైతుల వద్ద సమ్మతి తీసుకుని వారికే భూమి పట్టాలు ఖరారు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాలుగా ఉండి ప్రస్తుతం మున్సిపాలిటీలుగా మారిన ప్రాంతాలకు కూడా ఈ సాదాబైనామాలు వర్తించేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. -మిగతా 2 లో


### హిమంత శర్మ దేశంలోనే

# 'అత్యంత అవినీతి సీఎం'

- ప్రధాని మోడీ, అమిత్‌షా, హిమంత శర్మలు 'ల్యాండ్ ఎటిఎం' ఏర్పాటు చేశారు

గువహటి

హిమంత బిస్వా శర్మ దేశంలోనే అత్యంత అవినీతి ముఖ్యమంత్రి అని కాంగ్రెస్ నేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ గురువారం పేర్కొన్నారు. బకాజన్ నియోజకవర్గ పార్టీ అభ్యర్థి రతన్ ఎంగ్తికి మద్దతుగా జరిగిన ఎన్నికల సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీ, అమిత్‌షా, హిమంత శర్మలు 'ల్యాండ్ ఎటిఎం' ఏర్పాటు చేశారని, పేదలనుండి -మిగతా 2 లో



# 53 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెర

మొదటి తరువాయి
వ్యోమగాముల బందం చంద్రుని చుట్టూ పది రోజుల పాటు ప్రయాణించి, అంతరిక్ష చరిత్రలో సరికొత్త రికార్డులను సష్టించబోతోంది.

విజయవంతమైతే..నేరుగా చంద్రుడి పైకి

ఆర్టెమిస్-2 అనేది ఒక ప్రయోగం మాత్రమే కాదు. చంద్రునిపై శాశ్వత మానవ ఉనికిని ఏర్పాటు చేసే 'ఆర్టెమిస్ ప్రోగ్రామ్'లో అత్యంత కీలకమైనది. చంద్రుని ఉపరితలంపై మనుషులను దించడానికి ముందు చేసే కీలక పరీక్షలాంటింది. వాస్తవానికి ఈ ప్రయోగం ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 6:24 గంటలకు జరగాల్సి ఉంది. అయితే కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తడంతో నాసా సాంకేతిక బందాలు సత్వరమే స్పందించి సమస్యను పరిష్కరించడంతో ప్రయోగం సజావుగా సాగింది.

ఈ పది రోజుల యాత్రలో వ్యోమగాములు కీలక పరిశోధనలను చేయనున్నారు. భూమి నుంచి సుమారు 4 లక్షల కిలోమీటర్ల అవతలికి వీరు వెళ్లే అవకాశం ఉంది. వ్యోమగాముల ప్రాణాలను రక్షించే లైఫ్ సపోర్ట్ సిస్టమ్స్, కమ్యూనికేషన్, నావిగేషన్ వ్యవస్థలు చంద్రుని వద్ద ఎలా పనిచేస్తాయో వీరు పరిశీలించనున్నారు. ఈ మిషన్ విజయవంతమైతే, 'ఆర్టెమిస్ -3' ద్వారా చంద్రునిపై మనుషులను నేరుగా దించే ప్రక్రియ మరింత సులభతరం కానుంది. 1972లో అపోలో-17 తర్వాత, మళ్లీ ఇప్పుడు మానవ మేధస్సు చంద్రుడిని తాకేందుకు సిద్ధమైంది. భవిష్యత్ పరిశోధనలు, ప్రయోగాలలకు ఇది కీలకం కానున్నది.

# నిర్భయంగా ఓటేయండి..

మొదటి తరువాయి

భయపడవద్దని అమిత్ షా సూచించారు. "ఈసారి ఓటర్లకు భయం లేదు. బెంగాల్ ఓటర్లు ఓటు వేయకుండా ఏ గూండా అడ్డుకోలేదు. భయం లేకుండా ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి. టీఎంసీని బంగాళాఖాతంలో కలపాలి. భవానిపూర్‌లో మార్పు కోరుకుంటున్నారా.. లేదా..? మీరు సువేందు అధికారికి ఓటు వేయాలి అని అడిగేందుకు ఇక్కడికి వచ్చాను. ఈసారి బెంగాల్‌లోనే కాకుండా.. మమతా బెనర్జీ నియోజకవర్గమైన భవానిపూర్‌లో కూడా మార్పు రాబోతుంది" అని అమిత్ షా వ్యాఖ్యానించారు. బెంగాల్ బీజేపీ అధ్యక్షుడైన సువేందు అధికారి మమతా బెనర్జీ నియోజకవర్గమైన భవానిపూర్ నుంచి పోటీ చేస్తున్నారు. టీఎంసీ ప్రభుత్వాన్ని గద్దెదించడంతోపాటు మమత నియోజకవర్గంలోనే ఆమెను ఓడించాలనే లక్ష్యంతో బీజేపీ ఈ నిర్ణయం తీసుకుంది. గురువారం నాడు సువేందు అధికారి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి అమిత్ షా కూడా హాజరయ్యారు. ఆయన ఈ కార్యక్రమానికి హాజరుకావడం బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందని, సువేందు అధికారి గెలుపునకు ఉపయోగపడుతుందని అక్కడి నేతలు అంటున్నారు. ఈ నియోజకవర్గాన్ని, మమత ఓటమిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీజేపీ.. త్వరలో ఇక్కడ ప్రధాని మోదీతో కూడా ప్రచారం చేయించబోతుంది. పశ్చిమ బెంగాల్‌లో ఈ నెల 23, 29 తేదీల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి.

# గాజాలో శైశవయాత్ర!

గాజా సిటీ:

గాజాలో కొందరు చిన్నపిల్లలు తమ బొమ్మతో సరదాగా ఆడిన ఆట చూపరులకు కంటతడి పెట్టిస్తూ అక్కడి విషాద పరిస్థితులకు అద్దం పడుతున్నది. కొంతమంది పిల్లలు కలిసి ఒక బొమ్మను పాడెపై శవాన్ని ఎత్తినట్టు అతి జాగ్రత్తగా పైకెత్తి చిన్న స్ట్రెచ్చర్‌పై ఉంచి, శవయాత్ర మాదిరిగా దానిని మోస్తూ మెల్లిగా నడుస్తుండగా, మరికొందరు మౌనంగా నడుస్తూ వెళ్తున్న వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.ఒక శవయాత్ర పిల్లలకు కొత్త ఆటలా మారిందంటే గాజాలో నెలకొన్న విషాదం, శవయాత్రలు వారికి నిత్యకృత్యంగా మారిన పరిస్థితులను అర్థం చేసుకోవచ్చు. ఇజ్రాయెల్ దాడులతో ప్రతి రోజూ పదుల సంఖ్యలో పౌరులు మరణించడం, వారి అంతిమ యాత్రలు నిత్యకృత్యంగా మారడంతో పిల్లలు ఈ అంతిమయాత్రనే ఒక కొత్త ఆటగా భావించి ఆనందపడటం నిజంగా దురదృష్టమే

# భారత్‌కు ఇజ్రాయిల్ లైట్ మెషిన్ గన్స్

మొదటి తరువాయి
NE+EV 7.62x51 ఎల్‌ఎంజీ ఆయుధాలను భారత్‌కు అందించింది. అదనంగా మరో 4,000 యూనిట్లను ఈ ఏడాది చివరలో అందించనున్నట్టు ఇజ్రాయిల్ వెపన్స్ ఇండస్ట్రీస్ (ఐడబ్ల్యూఐ) ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది.

**పీఎల్ ఆర్ సిస్టమ్స్ ద్వారా సరఫరా**

ఈ ఆయుధాలను అదానీ గ్రూప్, ఐడబ్ల్యూఐల సంయుక్త సంస్థ అయిన పీఎల్ ఆర్ సిస్టమ్స్ ద్వారా ఈ సరఫరా జరిగింది. ఇవి భారత్‌లో ప్రయివేట్ రంగంలో చిన్న ఆయుధాలు, మందుగుండు సామగ్రిని తయారుచేస్తున్న తొలి సంస్థగా పీఎల్‌ఆర్ సిస్టమ్స్ గుర్తింపు పొందింది. టెక్నాలజీ బదిలీ ప్రక్రియ విజయవంతంగా పూర్తవడంతో, దేశీయంగా తయారీ చేపట్టడం సాధ్యమైందని సంస్థ పేర్కొంది.

**ఎల్‌ఎంజీ ప్రత్యేకత ఏంటంటే!**

నెగెవ్ 7.62 ఎల్‌ఎంజీ అత్యంత తేలికైన మెషీన్ గన్స్‌లో ఒకటి. కఠిన పరిస్థితుల్లో కూడా అత్యంత కచ్చితత్వంతో పనిచేసేలా దీన్ని రూపొందించారు. ఈ ఆయుధాన్ని ఇజ్రాయిల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) ఇప్పటికే ఉపయోగిస్తున్నాయి. లక్ష్యాన్ని చేరుకునే సామర్థ్యం వీటికి ఉంది. ఈ ఎల్‌ఎంజీకి సెమీ-ఆటోమేటిక్, ఫుల్-ఆటోమేటిక్ అనే రెండు రకాల విధానాలు ఉన్నాయి. అవసరాన్ని బట్టి భూమిపై మాత్రమే కాకుండా హెలికాప్టర్లు, వాహనాలు, నౌకలపై కూడా అమర్చే సౌకర్యం కల్పించారు.

**కచ్చితమైన లక్ష్యంతో టార్గెట్ ఛేదన!**

ఇది సైనిక చర్యల్లో విస్తృత వినియోగాన్ని అందిస్తుంది. దీని తేలికపాటి డిజైన్, అలాగే 7.62 మిల్లీమీటర్ గుండు సామర్థ్యం కారణంగా బలమైన కవర్‌ను కూడా ఛేదించే శక్తి దీనికి ఉంది. దీంతో పట్టణ యుద్ధ పరిస్థితుల్లో, ముఖ్యమైన ఆపరేషన్లలో ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. తక్కువ వెలుతురు కూడా కచ్చితమైన లక్ష్య సాధన కోసం పికాటిన్నీ రైల్స్, ట్రిటియం నైట్ సైట్స్‌ను ఇందులో అమర్చారు. అయితే, నాటో ప్రమాణాలకు అనుగుణంగా ఈ ఆయుధాలను రూపొందించారు. ఈ ఆయుధం దీర్ఘకాలిక వినియోగానికి అనుకూలంగా ఉంటుంది. అదనంగా కంప్యూటరైజ్డ్ వెపన్ సిస్టమ్‌తో అనుసంధానం చేసే సౌకర్యం ఉండటం వల్ల ఎంత ఒత్తిడిలోనైనా లక్ష్యాలను కచ్చితంగా ఛేదించగలదు.

# హిమంత శర్మ దేశంలోనే 'అత్యంత అవినీతి సిఎం'

మొదటి తరువాయి

భూమిని దోచుకుని కార్పోరేట్లకు దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మొత్తం 98,400 బిగాల భూమిని ముగ్గురు కార్పోరేట్లకు దోచిపెట్టారని అన్నారు. భారత్‌లోనే అత్యంత అవినీతి ముఖ్యమంత్రి హిమంత బిస్వాశర్మ అని, ఆయన కుటుంబం కూడా అవినీతిలో నెం.1 అని అన్నారు. వారి అవినీతికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. అవినీతి ఆరోపణల కారణంగానే హిమంత ప్రధాని మోడీ నియంత్రణలో ఉన్నారని, సిండికేట్ల ద్వారా ఆయన అస్సాంలో పాలన చేస్తున్నారని అన్నారు. ప్రముఖ గాయకుడు జుబీన్ గార్గ్ రాష్ట్రానికి, ప్రజలకు అండగా నిలిచారని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోగా కాంగ్రెస్ పార్టీ ఆయన మృతికి న్యాయం చేకూరుస్తుందని హామీ ఇచ్చారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 244(ఎ)ని పూర్తిగా అమలు చేస్తామని హామీ ఇస్తున్నామని అన్నారు. కార్బీ ఆంగ్లాంగ్, ఆరవ షెడ్యూల్ పరిధిలోని అన్ని ప్రాంతాల పాలన గువహటి లేదా ఢిల్లీ నుండి కాకుండా స్థానిక ప్రజల చేతుల్లోనే ఉంటుందని అన్నారు

# సన్‌రైజర్స్ పవర్ పంచ్

మొదటి తరువాయి

భారీస్కోర్ చేసింది. అనంతరం కోల్‌కతా నైట్‌రైడర్స్ పవర్‌ప్లే 6ఓవర్లు ముగిసేసరికి 74 పరుగులు చేసి గెలుపుపై ఆశలు రేపినా.. ఆ తర్వాత సన్‌రైజర్స్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో 161 పరుగులకే కుప్పకూలింది. కోల్‌కతా బ్యాటర్లు రఘువంశీ(52), రింకు సింగ్(35), అలెన్(28) మాత్రమే రాణించగా.. కెప్టెన్ రహానే(8), గ్రీన్(2), అనుకుల్ రారు(2)కి తోడు లోయర్ ఆర్డర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. సన్‌రైజర్స్ బౌలర్లు ఉనాద్కట్‌కు మూడు, ఈషన్ మలింగ, నితీశ్‌కుమార్ రెడ్డికి రెండేసి వికెట్లు దక్కాయి.

అంతకుముందు సన్‌రైజర్స్ పవర్ ప్లే 6 ఓవర్లు ముగిసేసరికి సన్‌రైజర్స్ జట్టు వికెట్ నష్టానికి 84పరుగులు చేయగా.. ఆ తర్వాత కోల్‌కతా ఓపెనర్లు అభిషేక్ శర్మ (21 బంతుల్లో 48; 4 ఫోర్లు, 4 సిక్సర్లు), ట్రెవిస్ హెడ్ (21 బంతుల్లో 46; 6 ఫోర్లు, 3 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఆ తర్వాత ఇషాన్ కిషన్ (14) అదే జోరును కొనసాగించే క్రమంలో ఔటయ్యాడు. అనికేత్ వర్మ ఒక్క పరుగుకే ఔటై నిరాశపరిచాడు. ఆ తర్వాత క్లాసెన్(52; 35బంతుల్లో 4ఫోర్లు, సిక్సర్)కి తోడు నితీశ్ కుమార్ రెడ్డి (39) బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 226పరుగులు చేసింది. కోల్‌కతా బౌలర్లు ముజరబ్బానికి నాలుగు, వైభవ్ అరోరాకు రెండు, కార్తీక్ త్యాగీ, అనుకుల్ రారుకు ఒక్కో వికెట్ దక్కాయి.

**స్కోర్‌బోర్డు...**

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: హెడ్ (సి)గ్రీన్ (బి)కార్తీక్ త్యాగి 46, అభిషేక్ శర్మ (సి)వరుణ్ చక్రవర్తి (బి)ముజరబ్బాని 48, ఇషాన్ కిషన్ (సి)రింకు సింగ్ (బి)ముజరబ్బాని 14, క్లాసెన్ (సి)రమణ్‌దీప్ సింగ్ (బి)ముజరబ్బాని 52, అనికేత్ వర్మ (సి)రింకు సింగ్ (బి)అనుకుల్ రారు 1, నితీశ్ కుమార్ రెడ్డి (సి)వరుణ్ చక్రవర్తి (బి)వైభవ్ అరోరా 39, సలీల్ అరోరా (బి)వైభవ్ అరోరా 0, హర్ష్ దూబే (నాటౌట్) 9, శివాంగ్ కుమార్ (సి)రహానే (బి)ముజరబ్బాని 4, అదనం 13. (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 226పరుగులు)

వికెట్ల పతనం: 1/82, 2/111, 3/112, 4/118, 5/200, 6/222, 8/226

బౌలింగ్: వైభవ్ అరోరా 4-0-47-2, ముజరబ్బాని 4-0-41-4, నరైన్ 4-0-39-0, వరణ్ చక్రవర్తి 2-0-31-0, కార్తీక్ త్యాగి 4-0-48-1, అనుకుల్ రారు 2-0-12-1.

# అమరావతికి ఆమోదముద్ర

మొదటి తరువాయి

ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రాజ్యసభ చైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మొత్తంగా ఎపి రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. 'ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు'కు రాజ్యసభ ఆమోదం తెలిపింది. మూజువాణి ఓటుతో ఈ బిల్లు ఆమోదం పొందగా, ఇప్పటికే లోక్‌సభలోనూ ఈ బిల్లుకు ఆమోదం లభించిన విషయం తెలిసిందే. దీంతో పార్లమెంట్ ఉభయసభల ఆమోదం పొందిన ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదానికి పంపబడనుంది. రాష్ట్రపతి సంతకం అనంతరం అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అధికారికంగా చట్టబద్ధత పొందనుంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా భావిస్తున్నారు.

ముఖ్యంగా రాజధాని విషయంలో ఉన్న అనిశ్చితి తొలగిపోవడం పట్ల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. రాజ్యసభలో ఈ బిల్లుపై జరిగిన చర్చ అనంతరం కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ సమాధానం ఇచ్చారు. ఏపీ రాజధాని అంశంపై ఉన్న అస్పష్టత పూర్తిగా తొలగిపోయిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆంధప్రదేశ్ ప్రజలకు శుభాభినందనలు తెలిపారు. ఇక, రాజ్యసభ విజిటర్స్ గ్యాలరీలో ఈ చర్చను వీక్షించిన ఏపీ మంత్రి నారా లోకేష్, ఇతర ఎంపీలు బిల్లు ఆమోదం పొందిన వెంటనే ఆనందాన్ని పంచుకున్నారు. 'జై అమరావతి' నినాదాలతో ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు.



కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కౌగిలించుకుని, బిల్లు పై ఆయన చక్కగా మాట్లాడారని అభినందించారు. మొత్తంగా, అమరావతి చట్టబద్ధత బిల్లును లోక్‌సభ, రాజ్యసభలు ఏకగ్రీవంగా ఆమోదించడం రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను చూపనుంది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుకు కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ, టీఎంసీ, ఆప్, బీజేడీ, ఆర్జేడీ, బీఆర్ఎస్, జేడీ(యూ), శివసేన మద్దతు ఇచ్చాయి. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధతపై జరిగిన చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. 17 మంది సభ్యులు చర్చలో పాల్గొన్నారు. అయితే రాజ్యసభలో సైతం ఈ బిల్లును వైసీపీ వ్యతిరేకించింది. రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. అలాగే బుధవారం లోక్‌సభలో ఈ బిల్లుపై చర్చ జరిగింది. ఈ చర్చలో 11 పార్టీలు పాల్గొన్నాయి. ఇక ఇటీవల ఏపీ అసెంబ్లీలో 11 గంటల 11 నిమిషాలకు ఈ బిల్లును ప్రభుత్వం పెట్టిన సంగతి తెలిసిందే. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ రాజ్యసభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంతో కూటమిలోని పార్టీల ఎంపీలకు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఈ బిల్లుకు మద్దతు తెలిపిన పలు పార్టీల నాయకులకు లోకేశ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను స్వయంగా కలిసి మంత్రి నారా లోకేశ్‌తోపాటు కూటమి ఎంపీలు ధన్యవాదాలు తెలిపారు. రాజధాని అమరావతి బిల్లు ఉభయసభల్లో ఆమోదం పొందడంతో రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేశారు.పార్లమెంట్ ఉభయ సభల్లో ఈ బిల్లు పాస్ కావడంతో రాజధాని అమరావతిలో సంబరాలు మిన్నంటాయి. మోకాళ్ళపై నిలబడి పార్లమెంటులో ఈ బిల్లుకు మద్దతిచ్చిన పార్టీలకు వారు ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు రాజధాని ప్రాంత రైతులు పాలాభిషేకం చేశారు. దాంతో ఆ ప్రాంతంలోని ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తీర్మానం చేసిన రాజధాని అమరావతి బిల్లును ఇటీవల కేంద్రానికి పంపారు. ఈ బిల్లు బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందడంతో.. రాజ్యసభకు పంపారు. ఈ బిల్లుపై గురువారం రాజ్యసభలో చర్చ జరిగింది. అనంతరం ఈ బిల్లు ఆమోదం పొందింది. ఉభయ సభలు ఆమోదం పొందడంతో.. ఈ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం కోసం రాష్ట్రపతి భవన్‌కు పంపనున్నారు.

కాళేశ్వర జలాలు చూపిస్తం..

# వచ్చే దమ్ముందా!

మొదటి తరువాయి
మరచి కేసీఆర్ జేబులోంచి డబ్బు ఖర్చు పెట్టారా అని అడగడం మీ అవివేకానికి, అతి తెలివికి నిదర్శనం. బీజేపీ ప్రభుత్వం నిర్మిస్తున్న జాతీయ రహదారులు, ప్రాజెక్టులకు మీ సొంత పైసలు ఖర్చు పెడు తున్నారా? ఆ నోట్లను దుబాయ్‌లో ముద్రిస్తు న్నారా? లేక మీ జేబుల్లో నుంచి ఖర్చు చేస్తున్నా రా? కాళేశ్వరం వల్ల ఉపయోగం లేదని గొంతు చించుకున్న కిషన్‌రెడ్డీ.. గతంలో మీ ప్రభుత్వ పెద్దలే నితిన్‌గడరీ నుంచి సీడబ్ల్యూసీ చైర్మన్ మసూద్ వరకు కాళేశ్వరంపై కురిపించిన ప్రశంసలు అబద్ధం అంటారా? అవివేకం అంటారా? తాజా పార్లమెం ట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎకనామిక్ సర్వే ఆఫ్ ఇండియా (చాప్టర్ 8) రిపోర్ట్ ప్రకారం.. '2014లో తెలంగాణలో 1.31 కోట్ల ఎకరాలుగా ఉన్న సాగు విస్తీర్ణం, 2023 నాటికి 2.2 కోట్ల ఎకరాలకు పెరిగింది. దీనికి ప్రధాన కారణం కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ కాకతీయ పథకాలే'నని కుండబద్దలు కొట్టింది. ఇది మీ కండ్లకు కనిపించడం లేదా? సీఎం రేవంత్‌రెడ్డి చెప్పిందే చెవుల్లోకి వెళ్తుందా?' అని నిలదీశారు. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ తెలంగాణ గొంతు కోసేలా కిషన్‌రెడ్డి మా ట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. రాజ్యస భలో కిషన్‌రెడ్డి పచ్చి అబద్ధాలు, చరిత్ర వక్రీకర ణలతో వికృతత్వాన్ని బయట పెట్టుకున్నారని మం డిప డ్డారు. తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయక వెన్నుచూపి పారిపోయిన కిషన్‌రెడ్డి నేడు మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# భూభారతితో భూవ్యవస్థలో సమూల మార్పులు

మొదటి తరువాయి

ప్రతి భూమికి ఆధార్ నెంబర్ మాదిరిగా భూధార్ నెంబర్ కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి జీపీవోల నియామకం చేపట్టామని చెప్పారు. రెండు విడతల్లో వేలాది మందికి శిక్షణ ఇచ్చి ప్రతి మండలానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించామని తెలిపారు. భూసర్వేలో పాత పద్ధతులకు స్వస్తి పలికి ఆధునిక రోవర్ యంత్రాలతో ఖచ్చితమైన సర్వే నిర్వహిస్తున్నామని, త్వరలో మరిన్ని యంత్రాలు అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయ భవనాలకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు బాలాజీ సింగ్,రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి లోకేష్ కుమార్, రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో దోస్తీ..రాష్ట్రంలో కుస్తీ!..


మొదటి తరువాయి
ఎన్నికల్లో మునుపటి కన్నా సీట్లు తగ్గి సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేని స్థాయికి బీజేపీ చేరుకుంది. అయితే లోక్‌సభ ఎన్నికల్లో కూటమి పార్టీలు చూపిన ఐక్యత రాష్ట్రాల విషయానికొచ్చే సరికి పలచబడింది. రాష్ట్రంలో ఎవరి ప్రయోజనాలు వారికి ఉండటంతో కూటమి పార్టీల మధ్య సమన్వయం కొరవడింది. రానురాను కేంద్రంలో దోస్తీ, రాష్ట్రంలో కుస్తీ తరహాలో ఇండియా కూటమి రాజకీయాలు మారాయి. దేశ వ్యాప్తంగా బలహీన పడిన జాతీయ పార్టీ కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి పేరుతో బలం పుంజుకోవాలని ప్రయత్నించినా ఆయా రాష్ట్రాల్లోని ప్రాంతీయ, ఇతర పార్టీలు దానికి ఆ అవకాశం ఇవ్వలేదు. కాంగ్రెస్ ఒంటెద్దు పోకడలూ కూటమికి బీటలు వారుస్తున్నాయి.

కాంగ్రెస్‌కు ఊతమెందుకు ఇస్తాం: మమత

ప్రస్తుతం బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సంగతి తీసుకుంటే కూటమిలో భాగస్వాములైనప్పటికీ మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ, కాంగ్రెస్ విడివిడిగానే పోటీ చేస్తున్నాయి. ఇక్కడ ఇండియా కూటమికి సంబంధించి ఎలాంటి పొత్తు లేదు. బెంగాల్‌లో కాంగ్రెస్‌కు ఏమాత్రం పట్టులేదని, అలాంటి పార్టీ కోసం తమ బలాన్ని ఎందుకు ఉపయోగిస్తామని మమత ప్రశ్నిస్తూ, ఈ ఎన్నికల్లో తాము సొంతంగానే పోటీ చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో టీఎంసీ, కాంగ్రెస్-వామపక్ష, బీజేపీల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది.

# యుద్ధాన్ని ఆపేది లేదు..

**అమెరికాకు అవమానం తప్పదు.. తేల్చిచెప్పిన ఇరాన్**

న్యూఢిల్లీ

అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఇరాన్ భారీ హెచ్చరిక జారీ చేసింది. ఎట్టి పరిస్థితుల్లో యుద్ధాన్ని ఆపేది లేదని స్పష్టం చేసింది. అమెరికా బెదిరింపులకు లొంగబోమని తెలిపింది. యుద్ధం ముగింపుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రకరకాల ప్రకటనలు చేస్తున్న వేళ ఇరాన్ చేసిన ప్రకటన సంచలనం సృష్టిస్తోంది. ఈ మేరకు ఇండియాలోని ఇరాన్ ఎంబసీ తన సోషల్ మీడియా వేదికగా ఈ ప్రకటన చేసింది.'మేం అమెరికా బాంబుల కారణంగా రాతియుగంలోకి వెళ్లడం లేదు. మాకు 7,000 ఏళ్ల నాగరిక చరిత్ర ఉంది. చరిత్రకు ఈ విషయం తెలుసు. అమాయకులైన పిల్లల్ని చంపి, అమానవీయ నేరాలు చేస్తున్న మీరు రాతియుగాన్ని ఆధునిక ప్రపంచంలోకి తెచ్చారు అనేది స్పష్టం" అని తన ట్వీట్‌లో పేర్కొంది. ఇరాన్‌తో యుద్ధంపై బుధవారం రాత్రి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. తాము ఇరాన్‌పై చేస్తున్న యుద్ధం కారణంగా ఆ దేశం రాతియుగంలోకి వెళుతుందన్నారు. ఇరాన్ సైన్యం, నేవీ పూర్తిగా బలహీనపడిపోయాయని చెప్పారు. యుద్ధాన్ని రెండు, మూడు వారాల్లో ముగిస్తామన్నారు. అయితే, ఇరాన్ మిలిటరీ మాత్రం ట్రంప్ ప్రకటనకు ధీటుగా స్పందించింది. అమెరికాకు తీవ్ర అవమానం జరిగే వరకు యుద్ధాన్ని వదలేది లేదని, అమెరికా పశ్చాత్తాప పడి, లొంగిపోయే వరకు తమ దాడులు కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఇరాన్ మిలిటరీకి నష్టం జరిగిందన్న అమెరికా ఆరోపణల్ని కూడా ఆ దేశం ఖండించింది. అమెరికా తమను తక్కువగా అంచనా వేసిందని అభిప్రాయపడింది. ఇరాన్ సైనిక ప్రతినిధి ఒకరు ఈ వ్యాఖ్యలు చేశారు. తమ దేశం దగ్గరున్న సైనిక శక్తి, మిస్సైళ్ల తయారీ గురించి అమెరికా ఇంటెలిజెన్స్‌కు సరిగ్గా తెలియదన్నారు. లాంగ్ రేంజ్ అటాక్ మిస్సైల్స్ డ్రోన్లు, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, స్పెషలైజ్డ్ ఎక్విప్‌మెంట్ వంటివి తమ దేశం దగ్గరున్నాయని ఇరాన్ ప్రతినిధి మీడియాతో తెలిపారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మైనంపల్లి లో గ్రామ సభ



**దేవరకొండ ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామంలో సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ సర్పంచ్ రాంసింగ్ నాయక్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వాటిని సద్వినియొగం చేసుకోవాలి అన్నారు. ఎమ్మెల్యే బాలునాయక్ కృషితో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా అన్నారు. ఈసందర్భంగా ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఎమ్మెల్యే బాలునాయక్ కి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా గ్రామంలో చేపట్టే కార్యక్రమాలను చర్చించి ప్రణాళిక తయారు చేసారు ఈసమావేశంలో ప్రత్యేక అధికారి పుల్య నాయక్,ఉప సర్పంచ్ లాలూ నాయక్,పంచాయతీ కార్యదర్శి అంబెడ్కర్, వార్డు సభ్యులు లక్ష్మీ ప్రశాంత్, బద్దు సునీత,సంతోష వెంకట్,స్నేహ వినోద్,పులిజాల నాగరాజు, హెడ్ మాస్టర్ భాగ్యలక్ష్మి,యు.ఎల్ .ఎచ్.పి. స్వాతి, ఏఎన్ఎం విజయ,డిసిపియు అంజలి, వివికేసేవ్య, అంగన్వాడీ టీచర్ కమలమ్మ,లచ్చి, బుజ్జి,ఆయా కలమ్మ, ఆశ ధనమ్మ,గ్రామస్థులు శ్రీను,శ్రీకాంత్,గోపి,లచ్చిరామ్,వెంకటయ్య,మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక
# భీమనపల్లిలో గ్రామ సభ



**దేవరకొండ ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** నల్లగొండ జిల్లా,గుడిపల్లి మండలం భీమనపల్లి గ్రామంలో గ్రామ సభను నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కసిరెడ్డి శ్రావణి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామపంచాయతీ సెక్రటరీ శంకర్, మండల రెవెన్యూ అధికారి సత్యరాజ్ ఉపసర్పంచ్ పల్లేటి సైదులు తదితరులు హాజరయ్యారు. సభలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చ జరిగింది. తాగునీటి సమస్య, పారిశుధ్యం, రహదారుల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల వంటి అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. అలాగే పింఛన్లు, రేషన్, ప్రభుత్వ పథకాల అమలు, రైతులకు సంబంధించిన సమస్యలు, పాఠశాలల అభివృద్ధి అంశాలపై కూడా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కసిరెడ్డి శ్రావణి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రజల సహకారం అవసరమని పేర్కొన్నారు. అధికారులు ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈసమావేశంలో గ్రామ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఆశా వర్కర్లు, వార్డు మెంబర్లు మరియు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

## అనాజిపూర్ లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సభ



**దేవరకొండ ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** చింతపల్లి మండలం అనాజిపూర్ గ్రామంలో ప్రజా పాలనలో భాగంగా గ్రామ సర్పంచ్ భూషిపాక అనిత మొగులయ్య పాల్గొని వివిధ అంశాల పైన చర్చించడం జరిగింది. గ్రామంలోని త్రాగు నీరు సమస్య, ఏ సమస్యా ఉన్న ప్రజలకు ఇబ్బంది లేకుండా పరిష్కారం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఆర్ ఐ.సునీత,జిపిఓ భాస్కర్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి ,వార్డ్ మెంబర్లు లక్ష్మమ్మ ,చంద్రకళ ,చిట్టెమ్మ , సత్యనారాయణ రెడ్డి ,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల నుండి నేరుగా వినతి పత్రాలు
# స్వీకరించిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

-సమస్యల పరిష్కారానికి హామీ.
-ప్రపంచ వ్యాప్తంగా నాకు నెట్వర్క్ ఉంది... మీకు ఏ పనైనా చేసి పెడతా.



**యాదాద్రి భువనగిరి ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పాల్గొని ప్రజల నుండి నేరుగా వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు అభివృద్ధి సమస్యలతో పాటు వ్యక్తిగత ఇబ్బందులను గ్రామస్తులు మల్లన్న దృష్టికి తీసుకువచ్చి వినతి పత్రాలు సమర్పించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న మల్లన్న , ప్రతి సమస్యను పరిష్కరించేందుకు 100 శాతం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మల్లన్న మాట్లాడుతూ, “ఈ పదవి మీరు ఇచ్చిన భిక్ష అని మీ కోసం ఎల్లప్పుడూ పోరాడటం నా బాధ్యత అని అన్నారు. నేను మీ బిడ్డను... మీకు ఏ కష్టం వచ్చినా నేను మీతోనే ఉంటానని,నా కార్యాలయం ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుంది” అని పేర్కొన్నారు. మీకు ఏ కష్టం వచ్చిన నా ఆఫీసుకి రండి అని వారికి భరోసానిచ్చారు..మీరు నాకు ఇచ్చింది వినతి పత్రాలు కాదని ఇది నా బాధ్యత అని, ఆ బాధ్యతను నిర్వర్తించడం కోసం 100% కృషి చేస్తానని వారికి ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నానని, ప్రతి వినతిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం సాధిస్తానని ఆయన భరోసా ఇచ్చారు.



## మర్రిగూడలో పశువుల అంగడి ప్రారంభం



**మర్రిగూడ, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలో పశువుల అంగడిని గ్రామ సర్పంచ్ వీరమళ్ళ శిరీష--లోకేష్ గౌడ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గ్రామానికి పూర్వ వైభవం తేవాలనే సంకల్పంతో ఈ అంగడిని ప్రారంభించామని సర్పంచ్ తెలిపారు. ప్రజలు, వ్యాపారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్ గౌడ్, ఉప సర్పంచ్ మహేశ్వరం రమేష్, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, వ్యాపారులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక

-గ్రామీణ సమస్యల పరిష్కారమే లక్ష్యం.
-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ .



**దేవరకొండ ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణ ప్రకణాళిక కార్యక్రమంలో భాగంగా దేవరకొండ మండలం కొండభీమన పల్లి గ్రామంలో నిర్వహించిన “గ్రామ సభ “ లో ఎమ్మెల్యే బాలు నాయక్ అన్ని శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం సేవాభావంతో పనిచేస్తూ, సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోందని, “ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక” ద్వారా ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టి, పథకాలను అర్హులకు చేరవేస్తోంది. “తెలంగాణ రైజింగ్ -- 2047” లక్ష్యంతో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దాలని సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు . మహాలక్ష్మి - ఉచిత బస్సు సౌకర్యం, 500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ళు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులకు చేరేలా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జామున మాధవ రెడ్డి,దేవరకొండ ఆర్డీవో రమణా రెడ్డి, డిఎస్పీ శ్రీనివాస్ రావు,తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీఓ పార్వతి, ఏడిఏ శ్రీలక్ష్మి,సిఐ వెంకట్ రెడ్డి,సర్పంచ్ శ్రీను,మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కంకర్ రోడ్డుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, డాంబర్ రోడ్ కావాలని డిమాండ్



**గన్నేరువరం, ఏప్రిల్ 02(నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గన్నేరువరం మండలంలో డబుల్ రోడ్డు సమస్యపై యువనేత గూడూరి సురేష్ గ్రామసభలో నిరసన తెలిపారు. కంకర్ రోడ్డుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే డబుల్ రోడ్డు పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే సతయ్యనారాయణ అసెంబ్లీలో ఈ సమస్యపై నోరు తెరవలేదని విమర్శిస్తూ, ముఖ్యమంత్రి దాకా ఈ సమస్య చేరాలని అన్నారు. కల్వర్టులు నిర్మించి, పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఎన్నిసార్లు మంత్రులను కలిసినా ఫలితం లేకపోయిందని, ఇకపై అప్లికేషన్లు అవసరం లేదని, ఒకటే తీర్మానం -- డబుల్ రోడ్డు వెంటనే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## గ్రామసభలో అసంతృప్తి
# వ్యక్తం చేసిన పాలకవర్గం

**పాలకుర్తి, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లపల్లి గ్రామంలో జరిగిన గ్రామసభలో పంచాయతీ పాలక వర్గం అసంతృప్తి వ్యక్తం చేసింది. పంచాయతీ కార్యదర్శి లబ్ధిదారులను మాట్లాడమని కోరగా, కొందరు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మాజీ సర్పంచ్ ముక్కెర శ్రీనివాస్‌ను పొగడుతూ ఆయన వల్లే ఇళ్లు మంజూరయ్యాయని, బిల్లులు ఆలస్యం కాకుండా అకౌంట్లలో డబ్బులు జమవుతున్నాయని అన్నారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది.



ప్రస్తుత సర్పంచ్ బండి శ్రీనివాస్ వెంటనే స్పందిస్తూ, గ్రామసభను తప్పుదోవ పట్టించేలా మాట్లాడడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ప్రస్తుత పాలకవర్గానికి సంబంధం లేదని చెప్పడం తప్పు అని పేర్కొన్నారు. అన్ని గ్రామాలతో పాటు మన గ్రామానికి కూడా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ ఇళ్లు మంజూరు చేశారని, మరో 50 ఇళ్లు మంజూరుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

# నూతన ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే





-ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.

**మిర్యాలగూడ ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
మిర్యాలగూడ మండలం చింతపెల్లి గ్రామపంచాయతీ నందు నూతన ఇందిరమ్మ ఇళ్ళు గృహప్రవేశంలో పాల్గొన్న శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి. లబ్దిదారుల కుటుంబ సభ్యులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.. అనంతరం లబ్దిదారులను షాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా లబ్ధి దారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల సొంత ఇంటికలను నెరవేర్చిన ప్రజా ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మరియు ఎమ్మెల్యే బి ఎల్ ఆర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతీ గ్రామంలో నిరుపేదల సొంత ఇంటి కలలు నెరవేరుస్తూ వారి కుటుంబాలలో ఆనంధాలు చూస్తుంటే ప్రజా ప్రభుత్వం లో భాగస్వామిని అయినందుకు గర్వంగా ఉందని అన్నారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దుతూనే నిరుపేదల సంక్షేమం కోసం,సన్నబియ్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ళు లాంటి అనేక వినూత్న పథకాలను అమలు చేస్తూ.. పేదల సంక్షేమానికి పెద్ద పీఠ వేస్తున్నారు అని అన్నారు.ప్రజా ప్రభుత్వానికి పేద ప్రజల ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని... అనునిత్యం మీకు అండగా ఉంటామని అన్నారు.. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీ శంకర్ నాయక్ , వార్డ్ మెంబర్స్, గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సమస్యలపై చర్చ

**దేవరకొండ ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
డిండి మండలం బొగ్గులదొన గ్రామంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రభుత్వ పథకాలపై చర్చ, గ్రామ సమస్యల గుర్తింపు మరియు పరిష్కారాలపై చర్చ, పథకాల అమలులో పారదర్శకత పెంపు అనే అంశాలపై గ్రామ సర్పంచ్ బుద్దుల శ్రీవాణి శ్రీను అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి గ్రామ పంచాయతీ సెక్రెటరీతో పాటు, ఉప సర్పంచ్, అధికారులు, వార్డు సభ్యులు, మహిళా సంఘాలు మరియు గ్రామస్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ బుద్దుల శ్రీవాణి శ్రీను మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేరుగా మనమే పరిష్కరించుకునేలా రేవంత్ రెడ్డినేతృత్వంలో ఎమ్మెల్యే బాలునాయక్ ,సలహా సూచనలు, ప్రభుత్వ అధికారులు ఆదేశాల మేరకు గ్రామ పరిపాలన జరుగుతున్నందుకు నేనెంతో సంతోషిస్తున్నాను. ఇక మన గ్రామం విషయానికి వస్తే మన ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలన్నీ అమలులో



ఉన్నవి, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో మొదటి విడతలో ఎనమిది మంజూరు అవ్వగా ఆరు నిర్మాణంలో ఉన్నవి. ఉచిత కరెంటు, మహాలక్ష్మి పథకం, పంటలకు గిట్టుబాటు ధర మరియు బోనస్, వ్యవసాయ పనిముట్లలో సబ్సిడీ మొదలగనవి అన్నీ అత్యద్భుతంగా అమలు జరుగుచున్నవి. మన గ్రామ చరిత్రలో కలగా మిగిలిపోతుంది అనుకున్న మన గేట్ వద్ద ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించి విప్లవాత్మక మార్పు తీసుకొచ్చినం, ఎన్నడూ సరైన పరిశుభ్రతకు నోచుకోని గ్రామంలోని వీధులను, ఇండ్ల మధ్యన ఉన్న కంప చెట్లను జేసిబి సహాయంతో శుభ్రం చేయించినం. పైన కొంత సాంకేతిక సమస్య వలన నల్లా నీరు రావడం కొంచెమ్ కష్టం అయ్యింది, త్వరలోనే ఆ సమస్య కూడా తీరుతుంది. దానికోసం కొన్ని బోర్ మోటార్స్ ను ఏర్పాటు చేసినం. మరొక నూతన బోర్ ను మన పాఠశాల ప్రాంతంలో వేసి అంగన్వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, స్త్రీ శక్తి భవనం మొదలగు వాటి నిర్మాణానికి వాటి అనంతరం వాడకానికి ఉపయోగపడేలా వేయిద్దాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శిగ శ్రీనివాస్, సీనియర్ నాయకులు గండికోట ఈదయ్య, పార్టీ నాయకులు బుద్దుల శ్రీను, పెరుమాళ్ళ ఎల్లయ్య, ముష్టిపల్లి అశోక్, వరికుప్పల బాలరాజు, జనగాం లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ వరికుప్పల జయమ్మ, మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జిల్లా స్థాయి రీడింగ్ ఛాంపియన్షిప్ పోటీలు



**పెద్దపల్లి, ఏప్రిల్ 02(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా స్థాయి రీడింగ్ ఛాంపియన్షిప్ పోటీలు ఘనంగా జరిగాయి. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రీడింగ్ కాంపిటీషన్ 2026లో విజేతలకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం ఎఫ్.ఎల్.ఎన్ లో భాగంగా పోటీలు నిర్వహించామని తెలిపారు. 14 మండలాల నుంచి ఎంపికైన 22 మంది విద్యార్థులు తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో చదవడం, కథలు చెప్పడం వంటి అంశాల్లో ప్రతిభ కనబరిచారని చెప్పారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులకు శు భాకాంక్షలు తెలియజేస్తూ, పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. వినూత్నంగా పోటీలు నిర్వహించి బహుమతులు అందించిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. విభాగాల వారీగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ పి.ఎం. షేక్, జిల్లా రిసోర్స్ టీం అధికారి గడ్డం జగదీశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 2వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సభలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**హుస్నాబాద్, ఏప్రిల్ 02(నీలగిరి ఎక్స్‌ప్రెస్) :**
హుస్నాబాద్ పట్టణంలోని 2వ వార్డులో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సభ జరిగింది. కార్యక్రమానికి వార్డ్ కౌన్సిలర్ కొండ రజిత సతీష్ అధ్యక్షత వహించారు. ప్రారంభంలో తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా రజిత ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, స్వశక్తి సంఘాలకు వడ్డీ లేని రుణాలు, రుణమాఫీ, గృహ జ్యోతి, ఇందిరమ్మ చీరలు, ఉచిత బస్సు వంటి పథకాలు అర్హులందరికీ చేరేలా కృషి జరుగుతోందని తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలో సీసీ రోడ్లు, ఇంజనీరింగ్ కాలేజీ, ఎల్లమ్మ చెరువు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో పట్టణం అభివృద్ధి చెందుతోందని చెప్పారు. పట్టణంలో పెరుగుతున్న కోతులు, కుక్కలు, పందుల సమస్యను అరికట్టాలని ప్రజలు తీర్మానించారు. అలాగే 2వ వార్డులో చెడిపోయిన రోడ్ల స్థానంలో కొత్త రోడ్లు వేయడం, కరెంట్ స్తంభాలు ఏర్పాటు, సీసీ రోడ్లు, మురికికాల్వల నిర్మాణం చేపట్టాలని తీర్మానాలు ఆమోదించారు. కార్యక్రమంలో పురపాలక కమిషనర్ టిమల్లికార్జున్, వార్డ్ ఆఫీసర్, ఆశా కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి



**మర్రిగూడ, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 361వ వర్ధంతి సందర్భంగా గురువారం మర్రిగూడ మండల కేంద్రంలోని విగ్రహానికి గ్రామ సర్పంచ్ వీరమళ్ళ శిరీష--లోకేష్ గౌడ్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, "పీడిత జనుల కోసం తన సర్వస్వాన్ని ధారపోసిన పాపన్న గౌడ్ తెలంగాణలో పుట్టడం మనందరికీ గర్వకారణం" అని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నల్ల యదయ్య గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్ గౌడ్, ఉప సర్పంచ్ మహేశ్వరం రమేష్, గౌడ సంఘ నాయకులు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మర్రిగూడలో గడ్డి ట్రాక్టర్ పల్టీ

-ఒకరికి తీవ్ర గాయాలు



**మర్రిగూడ, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండల కేంద్రంలోని చౌరస్తాలో గడ్డితోడుతో వస్తున్న ట్రాక్టర్ అతివేగంగా నడపడంతో పల్టీ కొట్టి ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కొండూరు గ్రామానికి చెందిన జేసీబీ యాజమాని దండుగుల కృష్ణపై గడ్డి కట్టలు పడటంతో కాళ్లు, చేతులు విరిగాయి. స్థానికులు అతన్ని వెంటనే హైదరాబాద్‌కు తరలించారు.ట్రాక్టర్ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో వినతిపత్రం

-మేటి చందాపురం గ్రామసభలో సమస్యల ప్రస్తావన




**మర్రిగూడ, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మేటి చందాపురం గ్రామపంచాయతీ ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా జరిగిన గ్రామసభలో సిపిఎం మండల కార్యదర్శి ఏర్పుల యదయ్య పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని బైనామీ రైతుల భూముల సమస్యలు పరిష్కరించాలని, ఇళ్ల స్థలాలు లేనివారికి మిగిలిన ప్లాట్లు కేటాయించాలని, 57 ఏళ్లు నిండిన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులకు కొత్త పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, అసైన్డ్ భూములు కేటాయించాలని, ఆరోగ్య హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పగిళ్ల రామచంద్రం, బొల్లోజు శేఖరాచారి, వీరమల్ల మల్లేష్ గౌడ్, రఘు మా రెడ్డి, పగిళ్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర లైసెన్స్ ల్యాండ్ సర్వేయర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

-రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొమ్ము శేఖర్

**వెల్దండ, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాష్ట్ర లైసెన్స్ ల్యాండ్ సర్వేయర్స్ అసోసియేషన్ సమావేశంలో గురువారం నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలానికి చెందిన కొమ్ము శేఖర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. సర్వేయర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, హక్కులు, గౌరవం, భవిష్యత్తు కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు. అసోసియేషన్ తరఫున శేఖర్‌కు అభినందనలు తెలియజేశారు.



# గ్రామాభివృద్ధికి గ్రామ సభ కీలకం

-మర్రిగూడలో 99 రోజుల ప్రగతి ప్రణాళిక




**మర్రిగూడ, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం మర్రిగూడ గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ వీరమళ్ళ శిరీష--లోకేష్ గౌడ్ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది.ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, గ్రామ సమస్యల పరిష్కారం, పారదర్శకత పెంపు అంశాలపై విస్తృతంగా చర్చించారు. సర్పంచ్ మాట్లాడుతూ, “గ్రామ సభలు సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరే వేదిక కావాలి. ప్రతి పౌరుడు గ్రామాభివృద్ధిలో భాగస్వామి కావాలి” అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ఉపసర్పంచ్, పంచాయతీ సభ్యులు, ఆశా వర్కర్లు, మహిళా సంఘాలు, గ్రామ పెద్దలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

-రాంపూర్ గ్రామసభలో తీర్మానం



**తలకొండపల్లి, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రాంపూర్ గ్రామంలో జరిగిన గ్రామసభలో సర్పంచ్ వట్టెల నిర్మల--శ్రీశైలం యాదవ్ అధ్యక్షతన అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని తీర్మానం చేశారు. ఇందిరమ్మ కమిటీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.గ్రామంలోని ప్రాథమిక సమస్యల పరిష్కారం, పాఠశాల, అంగన్వాడి, నీటి కొరత, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి చర్యలు చేపడతామని సర్పంచ్ తెలిపారు. ఉపాధి హామీ పనులు, సంక్షేమ పథకాల అమలు పారదర్శకంగా జరుగుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, టీచర్లు, వైద్య సిబ్బంది, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



శ్రీ హనుమత్ విజయోత్సవము సందర్భంగా వినోబా నగర్ కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉన్న ఆంజనేయ స్వామి అలంకరణ.

# ప్రతి వాహదారుడు హెల్మెట్ తప్పనిసరి

- బొడగుట్ట తండాలో అవగాహన ర్యాలీ



**మహబూబాబాద్, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బొడగుట్ట తండా గ్రామంలో గురువారం హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ జరిగింది.ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ దీపిక, సర్పంచ్ వీరన్న, గ్రామ ప్రజలతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ప్రజలకు సూచించారు.

# రేవల్లిలో తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

-పాల్గొన్న ఎమ్మెల్యే మేఘా రెడ్డి, కలెక్టర్ ఆదర్శ సురభి



**వనపర్తి, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా రేవల్లి మండల కేంద్రంలో నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే మేఘా రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి గురువారం ప్రారంభించారు.కొత్తగా ఏర్పడిన మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు. ఏదుల, రేవల్లి, శ్రీరంగాపూర్ మండలాల్లో ఒక్కో భవనానికి రూ.32 లక్షలు కేటాయించి పనులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.రేవల్లి--ఏదుల రహదారి సౌకర్యం మెరుగుపరిచినట్లు, తాగునీటి సమస్య పరిష్కారానికి మిషన్ భగీరథ ద్వారా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కొత్త పోలీస్ స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు.కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఎల్పీజీ, సీఎన్జీ గ్యాస్ కొరత

-ఆటో, కారు డ్రైవర్లకు తీవ్ర ఇబ్బందులు



**హైదరాబాద్, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నగరంలో ఎల్పీజీ, సీఎన్జీ గ్యాస్ కొరతతో ఆటోలు, కార్లు నడిపే డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి గ్యాస్ బంక్ వద్ద కిలోమీటర్ల మేర క్యూ లైన్లు ఏర్పడి, గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది.డ్రైవర్లు వాపోతూ, “ఒక్కరికి కేవలం రూ.500 విలువైన గ్యాస్ మాత్రమే ఇస్తున్నారు. రోజుకు రూ.300--400 ఆటో కిరాయిలు కట్టాలి కానీ గ్యాస్ కోసం 5--6 గంటలు బంకుల దగ్గరే గడపాల్సి వస్తోంది” అని తెలిపారు.మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో గిరాకీ తగ్గిందని, గ్యాస్ కొరతతో పరిస్థితి మరింత దయనీయంగా మారిందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు.ఎల్పీజీ, సీఎన్జీ సరఫరా సమస్యను తక్షణమే పరిష్కరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# ప్రజా పాలన--పట్టణ ప్రగతి సభ విజయవంతం

--తెల్కపల్లి మండలంలో ఘనంగా నిర్వహణ



**తెల్కపల్లి, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
99 రోజుల ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం తెల్కపల్లి మండల కేంద్రంలో సభ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి హాజరయ్యారు.ప్రజల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, మౌలిక సదుపాయాలపై చర్చించి, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలపై ప్రజల అభిప్రాయాలు సేకరించారు. అనంతరం పీఏసీఎస్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్, ఉపసర్పంచ్ శ్రీనివాసులు, మాజీ వైస్ చైర్మన్ యాదయ్య, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వినోద్, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భిన్నత్వంలో ఏకత్వం

- మాదకద్రవ్యాల నిరోధంపై చైతన్యం
-కోహెడ జెడ్పీ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం



**కోహెడ, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోహెడలో “భిన్నత్వంలో ఏకత్వం” మరియు “మాదకద్రవ్యాల నిరోధం” అంశాలపై అవగాహన కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది.ప్రధానోపాధ్యాయురాలు తిరుపతి బాయి అధ్యక్షతన, ఉపాధ్యాయుడు మీలా విజయ్‌కుమార్ సమన్వయంతో విద్యార్థులు ప్రసంగాలు, పాటలు, స్కిట్‌లు ప్రదర్శించి జాతీయ సమైక్యత, సౌభ్రాతృత్వం, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై చైతన్యం కల్పించారు.విద్యార్థి దశలో చెడు అలవాట్లకు దూరంగా ఉండి, మంచి లక్ష్యాలతో ముందుకు సాగాలని ఉపాధ్యాయులు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, శిక్షణార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్ నాయక్

-అడవిదేవులపల్లిలో ఘనంగా కార్యక్రమం



**అడవిదేవులపల్లి, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా అడవిదేవులపల్లి గ్రామపంచాయతీలో గురువారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ, ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ కేతవత్ శంకర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 99 రోజుల ప్రణాళికను విజయవంతం చేయాలని, పట్టణాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. మండలానికి బ్రిడ్జి ఏర్పాటు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, సైనిక్ స్కూల్, ఎంపీడీఓ, ఎమ్మార్వో కార్యాలయాల ఏర్పాటు కోసం కృషి చేస్తామని తెలిపారు. దున్నపోతుల గండి లిఫ్ట్ పనులు త్వరగా పూర్తి చేయడానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎంఆర్ఓ రాగ్య నాయక్, ఎస్సై శేఖర్, సర్పంచ్ కూరాకుల చిన్న రామయ్య, పార్టీ నాయకులు, అధికారులు, గ్రామ సిబ్బంది, ఆశా వర్కర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ఊరుకొండలో గ్రామసభ



**ఊరుకొండ, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జగ్ బోయిన్‌పల్లి గ్రామపంచాయతీలో 99 రోజుల ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం గ్రామసభ జరిగింది. సర్పంచ్ సోనీ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో ఎంపీడీవో సత్యపాల్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, సిడబ్ల్యూసి శ్రీశైలం, డిసిపిఓ నాగర్‌కర్నూల్, గ్రామ కార్యదర్శి హరికృష్ణ, వార్డు సభ్యులు, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఆరేపల్లిలో ప్రజా పాలనప్రగతి ప్రణాళిక

- ప్రత్యేక గ్రామసభలో సంక్షేమ పథకాలపై చర్చ





**పెద్దపల్లి, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
99 రోజుల కార్యాచరణలో భాగంగా ఆరేపల్లి గ్రామంలో గురువారం ప్రత్యేక గ్రామసభ జరిగింది.ఈ సభలో గ్రామ సర్పంచ్ గారిడే లక్ష్మీ, ఉపసర్పంచ్ లోమిత రమ్య, పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రత్యేకంగా చర్చించి, ప్రజలకు అవగాహన కల్పించారు.గ్రామస్థులు తమ సమస్యలను వివరించగా, ప్రజా పాలనలో అందరి సహకారంతో ముందుకు వెళ్తేనే అభివృద్ధి సాధ్యమని సభలో పేర్కొన్నారు.

## బాలాపూర్‌లో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

-ప్రత్యేక పూజల్లో పాల్గొన్న పారిజాత నర్సింహారెడ్డి



**హైదరాబాద్, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ డివిజన్‌లో హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని పూజలు చేశారు. మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, బాలింగని జంగయ్య, పగడాల ఉమేష్ తదితరులు హాజరయ్యారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**తిప్పర్తి ఏప్రిల్ 02 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద నిర్వహించిన "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" గ్రామసభలో రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ రజిత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, ఇతర ప్రజా ప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థుల సమస్యలను నేరుగా తెలుసుకొని, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవడం, అలాగే గ్రామ అభివృద్ధి ప్రణాళికలపై చర్చ జరిగింది. మంత్రి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, తిప్పర్తి మండల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో ప్రజల వినతులను స్వీకరించి, సత్వర పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి మాజీ ఎంపీటీసీలు, వార్డు సభ్యులు గ్రామ ప్రజలు వివిధ పథకాల కొరకు దరఖాస్తులను అందజేశారు.

## గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రజల సహకారం కీలకం

కల్వకోల్ గ్రామసభలో సర్పంచ్ లక్ష్మమ్మ



**మహేశ్వరం, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
99 రోజుల ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా కల్వకోల్ గ్రామంలో గురువారం గ్రామసభ జరిగింది. సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ--రవి మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, గ్రామాభివృద్ధి అంశాలపై చర్చించారు. గ్రామస్తులు లేవనెత్తిన సమస్యలను సర్పంచ్ నోట్ చేసుకుని, "మన ఊరిని ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి రావాలి. సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తాం" అని తెలిపారు. ఈ సందర్భంగా గట్టుపల్లి జంగయ్య ఇందిరమ్మ ఇంటిని సర్పంచ్ చేతుల మీదుగా గృహప్రవేశం చేసి రిబ్బన్ కట్ చేశారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్, ఉపసర్పంచ్ జనార్దన్ గౌడ్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, అంగన్వాడి, ఆశా వర్కర్లు, గ్రామ పెద్దలు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

# సర్వాయి పాపన్న గౌడ్ జీవితం ఆదర్శనీయం

-ఇల్లందలో ఘనంగా పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు



**వర్ధన్నపేట,ఏప్రిల్ 2(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాచరికపు వ్యవస్థ నీడలో జమిందార్లు,జాగీర్దారుల అరాచకాలను సహించలేక... మొగలాయిల దౌర్జన్యాలను ధైర్యంగా ఎదుర్కొని సామాన్య ప్రజల హక్కులను కాపాడిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని వర్ధన్నపేట ఎస్సై మేరుగు రాజు అన్నారు. గురువారం బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి ని పురస్కరించుకొని వర్ధన్నపేట మండలం ఇల్లంద గౌడ సంఘం అధ్యక్షులు సమ్మట సూరి గౌడ్ , ఉపాధ్యక్షులు, కళ్ళు గీతా కార్మిక సంఘం వరంగల్ జిల్లా గౌరవ సలహాదారులు సట్ల సూరయ్య గౌడ్ ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికిష్ట ముఖ్యఅతిథిగా వర్ధన్నపేట ఎస్సై మెరుగు రాజు హాజరై గౌడ సంఘం అధ్యక్షులు సమ్మట సూరి గౌడ్ , ఉపాధ్యక్షులు సట్ల సూరయ్య గౌడ్, పోశాల వెంకన్న గౌడ్, గౌడ సంఘం సభ్యులతో కలిసి సర్దార్ పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పేద, బడుగు బలహీనవర్గాలపై జరిగిన అన్యాయాల పైన విరోచిత పోరాటం చేసిన గొప్ప పోరాట యోధుడని కొనియాడారు. గెరిల్లా పోరాటంతో గోల్కొండ కోటను జయించిన వీరుడు పాపన్నగౌడ్ అని, బహుజనుల అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేసిన పాపన్నగౌడ్ ఆదర్శప్రాయుడని, ఆయన సేవలు చిరస్మరనీయమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు మద్ది రాజయ్య గౌడ్, సట్ల నరసింహులు గౌడ్, సట్ల లక్ష్మీనారాయణ గౌడ్, సమ్మెట యాకయ్య గౌడ్, పెద్దగోని కవి రాజు గౌడ్, సట్ల సుభాష్ గౌడ్, సట్ల సాయిలు గౌడ్, సమ్మట వెంకటేశ్వర్లు గౌడ్, సమ్మెట శ్రీరాములు గౌడ్,బాలగాని రాజు గౌడ్,బత్తిని రాజ బాబు గౌడ్,సట్ల అనిల్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా సంక్షేమపథకాల అమలు

-తుమ్మలూరులో గ్రామ సభలో సీఎస్, కలెక్టర్



**మహేశ్వరం, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
99 రోజుల ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా తుమ్మలూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామసభ జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు, జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీఎస్, కలెక్టర్ సంక్షేమ, ఆరోగ్య, ఉద్యానవన శాఖల స్టాళ్లను సందర్శించి, రైతు రుణమాఫీ, బీమా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పాస్‌బుక్కులు, సన్నబియ్యం పంపిణీ, వైద్య సేవలు వంటి పథకాల అమలు తీరును పరిశీలించారు. కొత్త పథకాలైన ముఖ్యమంత్రి అల్పాహారం, ఇందిరమ్మ జీవిత బీమా, మధ్యాహ్న భోజనం విస్తరణ, సహజ సేంద్రీయ వ్యవసాయం పై అవగాహన కల్పించారు. సీఎస్ మాట్లాడుతూ, "2047 విజన్‌తో రాష్ట్రాన్ని దేశంలో ముందంజలో నిలపడం లక్ష్యం. ప్రతి అర్హుడికి ఇళ్లు, సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయం" అని తెలిపారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, శిక్షణా కార్యక్రమాల ద్వారా సాధికారత కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్య, వైద్య సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, రైతు భరోసా, గృహ జ్యోతి, మహాలక్ష్మి వంటి పథకాలు ప్రతి కుటుంబానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి చెక్కులు, దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సభలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, అధికారులు, తుమ్మలూరు సర్పంచ్ తుమ్మేటి అండాలు కృష్ణ యాదవ్, ఉపసర్పంచ్ సంగారెడ్డి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

## గ్రామ కంఠం భూములను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేయాలి

-బొల్లంపల్లి గ్రామసభలో ప్రజల వినతి



**వెల్దండ, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామపంచాయతీ వద్ద గురువారం జరిగిన గ్రామసభలో గ్రామ యువకులు, ప్రజల ఆధ్వర్యంలో గ్రామ కంఠం ప్రభుత్వ భూములను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆ భూములపై ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ ప్రసాద్ సమక్షంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు.

## బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధిగా సుమశ్రీ

-నల్లగొండలో ప్రమాణ స్వీకారం




**నల్లగొండ, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నల్లగొండ జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల్లో మహిళా ప్రతినిధిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కనగల్ మండలం ఏమిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన అడ్వకేట్ ఏమిరెడ్డి సుమశ్రీ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "నా ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు" అని తెలిపారు.

## పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి

ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి డిమాండ్



**నల్లగొండ, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వంటింటి గ్యాస్ ధరలను యుద్ధం పేరుతో పెంచడం అన్యాయమని, వెంటనే తగ్గించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. అనంతారం గ్రామంలో జరిగిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, "కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ధరలు అమాంతం పెరిగి సామాన్య ప్రజలు తినలేని, కొనలేని పరిస్థితుల్లోకి నెట్టబడ్డారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ. 2500, విద్యార్థులకు స్కూటీలు, ఉచిత విద్య, వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, మురికికాలువలు వంటి మౌలిక వసతులు అభివృద్ధి చెందకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మహిళలు ఐద్వా సంఘంలో సభ్యులుగా చేరి ఉద్యమాల్లో పాల్గొని తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కొండ అనురాధ, శాఖ కార్యదర్శి కమ్మపాటి లక్ష్మి, అధ్యక్షురాలు వెలుగు పున్నమ్మ, నాయకురాలు రుద్రాక్ష హేమలత, నాంచారమ్మ, యాదమ్మ, పార్వతమ్మ, అంజమ్మ, అలివేలు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## దోరెపల్లిలో ఉత్సాహంగా ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక

**-ఆరు గ్యారంటీలపై గ్రామ సభలో అవగాహన**



**కనగల్, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలన్న లక్ష్యంతో గురువారం దోరెపల్లి గ్రామంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమం జరిగింది.గ్రామసభలో మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత వంటి పథకాల దరఖాస్తులను స్వీకరించారు. మహిళలకు ఆర్థిక చేయూత, గ్యాస్ సబ్సిడీ, రైతులకు పెట్టుబడి సాయం, ఇల్లు లేని పేదలకు గృహనిర్మాణం, వృద్ధులు, వితంతువులకు పెన్షన్ వంటి అంశాలపై ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, సర్పంచ్ బక్క ఎల్లమ్మ, కార్యదర్శి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి

**-నల్గొండలో నేతలకు వినతిపత్రాలు**



**నల్గొండ, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలోని ప్రధాన పత్రికల జర్నలిస్టులందరికీ నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ జర్నలిస్టులు గురువారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు.దీనిపై స్పందించిన నేతలు, “ముఖ్యమంత్రితో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు గుర్తింపు కార్డులు అందేలా చూస్తాం” అని హామీ ఇచ్చారు.

## కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

**వెల్దండ గ్రామసభలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**వెల్దండ, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం వెల్దండ మండల కేంద్రంలో జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. మహిళా సాధికారత కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం” అని తెలిపారు.గ్రామానికి 48 ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు, 989 మంది లబ్ధిదారులకు ఉచిత కరెంట్ అందించినట్లు వివరించారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను మండలానికి కేటాయిస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో సుధా సత్యనారాయణకు రూ.49,000 చెక్కు, అన్నెపు పద్మకు రూ.19,000 సీఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.ఈ సభలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు, ఆర్య వైశ్య సంఘం నాయకులు, ఎంపీడీఓ, తహశీల్దార్, వైద్యాధికారులు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజాపాలనలో నెరవేరుతున్న స్వప్నాలు

**-ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామసభ.**
**-సర్పంచ్ వర్కాల బాల నారాయణ.**






**దేవరకొండ ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
డిండి మండలం గోనబోయినపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 లోభాగంగా సర్పంచ్ వర్కాల బాల నారాయణ అధ్యక్షతన నిర్వహించారు.సభలో గ్రామ జిపిఓ మధుసుధన్ రావు ఉప సర్పంచ్ బద్దెల బాల లింగయ్య, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఉపేందర్, మహిళా సంఘ అధ్యక్షురాలు హాజరయ్యారు. సర్పంచ్ బాల నారాయణ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం చేస్తున్న సేవలు అమోఘమైనవి.మా గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు 27మంది నిర్మాణం చేసుకున్నారని,సంతోషంగా ఉందని,రైతు బీమాలో భాగంగా 8 మందికి 40లక్షలు ఒక్కరికీ 5లక్షల చొప్పున, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు లబ్ధి పొందారని, కళ్యాణ లక్ష్మి , షాద్ ముభారక్ పథకంలో 11మంది లబ్ధిదారులకు లబ్ధి చేకూరిందనిఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం జూన్ రెండవ తారీఖు నుండి ప్రారంభం కాబోతోందని,రైతు బంద్ వివరాలు, చర్చించారు.అలాగే గ్రామం వెలుపల ఉన్న చెట్లు తొలగించాము, కోతుల బెడద కారణం గా రోడ్డు ఇరువైపులా ఉన్న చెట్లు తొలగింపు చేశామని,రైతుప్రజా ప్రభుత్వ పథకాల ప్రాధాన్యత లాభాలు వివరించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బద్దెల శ్రీనివాస్, కానిస్టేబుల్ హుస్సేన్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు, అధికారులు ,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పాపన్న గౌడ్ ఆశయాలు సాధిద్దాం

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆధిపత్య కులాల ఆధిపత్యాన్ని, బానిసత్వాన్ని ధిక్కరించిన బహుజన చక్రవర్తి పాపన్న గౌడ్ ఆశయాలు సాధిద్దామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం సర్వాయి పాపన్న 316 వర్ధంతి సందర్భంగా పట్టణ కేంద్రంలోని కాటమయ్య గుట్టపై ఉన్న పాపన్న గౌడ్ విగ్రహానికి టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా లతో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ.. సమాజంలోని అన్యాయాలపై ధైర్యంగా పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్నను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని, సామాజిక న్యాయం కోసం పాపన్న చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. పాపన్న గౌడ్ స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, మెకానిక్ బాబా, శేఖర్ గౌడ్, జగదీష్, కొండల్ రెడ్డి మరియు కాటమయ్య దేవస్థానం కమిటీ చైర్మన్ చుక్క అల్లాజీ గౌడ్, ప్రధాన కార్యదర్శి గంగా రవీందర్ గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు చుక్క నిరంజన్ గౌడ్, పట్టణ అధ్యక్షులు గజ్జె వెంకటయ్య గౌడ్, గజ్జ లక్ష్మీపతి గౌడ్, పల్లె నారాయణ గౌడ్, దుసకంటి యాదయ్య గౌడ్, జవాజీ రమేష్ గౌడ్, గోదా సతీష్ గౌడ్, గజ్జె నరసింహ గౌడ్, గుంద్రాతి నరేష్ గౌడ్, గజ్జె బాలకృష్ణ గౌడ్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అధ్యక్షులు గజ్జి రాఘవేందర్ గౌడ్, మెక్రాల శివ గౌడ్, ఆంజనేయులు గౌడ్, సాయి గౌడ్ పట్టణ గౌడ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# భక్తికి రూపం హనుమంతుడు





**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
భగవంతుడి భక్తికి రూపం హనుమంతుడని, చిన్నాపెద్దా భక్తితో అతడిని కొలుస్తారని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని కాటమయ్య గుట్టపై ఉన్న హనుమాన్ దేవాలయంలో హనుమాన్ జయంతిని గౌడ సంఘం అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నర్సింహా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా లతో కలిసి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గౌడ సంఘం సభ్యులు శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, మెకానిక్ బాబా, శేఖర్ గౌడ్, జగదీష్, కొండల్ రెడ్డి మరియు కాటమయ్య దేవస్థానం కమిటీ చైర్మన్ చుక్క అల్లాజీ గౌడ్, ప్రధాన కార్యదర్శి గంగా రవీందర్ గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు చుక్క నిరంజన్ గౌడ్, పట్టణ అధ్యక్షులు గజ్జె వెంకటయ్య గౌడ్, గజ్జ లక్ష్మీపతి గౌడ్, పల్లె నారాయణ గౌడ్, దుసకంటి యాదయ్య గౌడ్, జవాజీ రమేష్ గౌడ్, గోదా సతీష్ గౌడ్, గజ్జె నరసింహ గౌడ్, గుంద్రాతి నరేష్ గౌడ్, గజ్జె బాలకృష్ణ గౌడ్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అధ్యక్షులు గజ్జి రాఘవేందర్ గౌడ్, మెక్రాల శివ గౌడ్, ఆంజనేయులు గౌడ్, సాయి గౌడ్ పట్టణ గౌడ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లలితపల్లిలో పశువులకు గాలికుంటు టీకా

**- 95 పశువులకు టీకా వేసిన అధికారులు**



**ఎలిగేడు, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు అనుబంధ గ్రామమైన లలితపల్లెలో గురువారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకా వేశారు.గ్రామంలో మొత్తం 95 పశువులకు టీకా వేసినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి ఝాన్సీ సూచించారు.కార్యక్రమంలో సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఉపసర్పంచ్ ముంజం నరేష్, వార్డు సభ్యులు మడుపు నరేందర్, కాంపెల్లి సాయి ప్రశాంత్, గుండేటి మురళి, వెటర్నరీ అసిస్టెంట్ శంకర్, గోపాలమిత్ర పెద్ది సమ్మయ్య, రైతులు, పశు పోషకులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి

- పాపిశెట్టి రాము



**ఆమనగల్లు, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ సంఘ సేవకులు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము కోరారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు నవచైతన్య కాలనీలో గురువారం నిర్వహించిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' వార్డు సభలో ఆయన పాల్గొన్ని ఉచిత వైద్య శిబిరం ప్రారంభించారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మైమున బేగం, ఎఎన్ఎం లు నీరజ కుమారి, భారతి, ఆశా వర్కర్లు చంద్రకళ, వసంత, సంధ్య, బీబీ, విజయ, నయీమా, సల్మా స్థానిక నాయకులు జంతుక కిరణ్, చలిచీమల సతీష్, శ్రీను నాయక్, శేఖర్, రాములు, ఈదయ్య, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి






**ఆమనగల్లు, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆచారి అన్నారు. గురువారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ హై స్కూల్ గ్రాడ్యుయేషన్ డే మరియు 25వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిలుగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేస్తేనే గుర్తింపు లభిస్తుందన్నారు. విద్యార్థులకు బంగారు భవిష్యత్తును అందించాలంటే ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్, సీఐ వెంకటేశ్వర్లు, ఎంఈఓ పాండు, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, లిటిల్ స్కాలర్స్ హై స్కూల్ చైర్మన్ చుక్క అల్లాజీ గౌడ్, అకాడమిక్ అడ్వైజర్ జిల్లెల్ల సుదర్శన్ రెడ్డి, కరెస్పాండంట్ జిల్లెల్ల సుజాత రెడ్డి, డైరెక్టర్ చుక్క సావిత్రి, సావిత్రి, సుజాత, శ్రీశైలం, యాదయ్య, శ్వేత, అహ్మద్ తదితర ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, రఫీ, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ,ఏప్రిల్ 02(నీలగిరి ఎక్స్ ప్రెస్):** అచంచలమైన భక్తి, అపారమైన శక్తి, అజేయమైన ధైర్యానికి ప్రతీకగా ప్రతి హృదయంలో వెలుగొందే భగవాన్ శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం దేవరకొండ పట్టణంలోని శివాలయం నుండి నిర్వహించిన ర్యాలీని జెండా ఊపి దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ప్రారంభించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ,ప్రతి ఒక్కరూ హనుమంతుడిలా ధైర్యసాహసాలతో, నిస్వార్థ సేవాభావంతో, అపార సహనంతో జీవించాలని, మనిషిలోని భయాలను జయించి, సత్యం, ధర్మమార్గంలో ముందుకు సాగేందుకు హనుమంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ దేవరకొండ ప్రాంత ప్రజలపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కొర్ర రాంసింగ్ నాయక్,పట్టణ కౌన్సిలర్లు హన్మంతు సాయి చంద్ర, కన్యశ్రీ సేవ్య నాయక్,అడ్వకేట్ ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కడ్తాలలో వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు



**ఆమనగల్లు, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** హిందూ ధర్మం సాంస్కృతి సాంప్రదాయ పరిరక్షణే లక్ష్యంగా పవనసుత హనుమాన్ ను కీర్తిస్తూ కడ్తాల్ పట్టణంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలో ఉన్న హనుమాన్ ఆలయంలో హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి హాజరై హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు సింధూర తిలకం దిద్ది పవన సుత ఆంజనేయ స్వామి జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కడ్తాల్ పట్టణమంతా హనుమాన్ నామస్మరణతో మారుమోగింది పెద్ద ఎత్తున మహిళలు ప్రజలు హనుమాన్ భక్తులు దీక్ష దారులు హనుమాన్ మాలధారులు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేశ్వర శర్మ, సింహాద్రి పంతులు హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో భక్త బంధం అధ్యక్షుడు బాచిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జంగారెడ్డి, మాజీ వార్డు మెంబర్ నరేందర్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షుడు దోనాదుల మహేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు విజయానంద్, సంతోష్, పెంటా రెడ్డి, రవీందర్ రెడ్డి, అశోక్ రెడ్డి, శ్రీను, మహేష్, తరుణ్, నరేష్, యాదగిరి, వెంకటేష్, నేతి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి





**ఆమనగల్లు, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** జై బోలో హనుమాన్ కీ.. రామలక్ష్మణ జానకీ.. జై శ్రీరాం.. జైజై శ్రీరాం.. జై హనుమాన్.. జైజై హనుమాన్ అంటూ గురువారం అంజన్న ఆలయాలు మార్మోగాయి. హనుమాన్ పెద్ద జయంతి వేడుకలను ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని అంగడి బజార్ హనుమాన్ దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. వేడుకల్లో ఆలయ అర్చకులు రామకృష్ణ అయ్యగారు, కౌన్సిలర్ నాగిళ్ళ జగన్, పాతకోట శ్రీశైలం (శిరి), జెజ్జాల ఆనంద్, దాస్యం వంశీ, ముక్కెరి వెంకటేష్, కోట్ల వెంకటేష్, లండం మల్లేష్. నరేష్, రామకృష్ణ మరియు భక్తులు పాల్గొన్నారు.

**సాకిబండ తండాలో హనుమాన్ శోభాయాత్ర**

హనుమాన్ జయంతి పురస్కరించుకొని ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండ తాండలోని రాముల వారి గుట్టపై భోగ్ బండార్ పూజా కార్యక్రమాన్ని గిరిజనులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా తండా వాసులు పెద్ద సంఖ్యలో హాజరై శోభాయాత్ర ప్రారంభించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. యువత భక్తి మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో హిందువులు జనజాగృతి పొందాల్సిన అవసరం ఉందని తెలిపారు. హిందూ సాంప్రదాయాలు, సంస్కృతిని భవిష్యత్ తరాలకు తెలియజేయడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. దైవభక్తిని జీవితంలో భాగంలో చేసుకుని ఆధ్యాత్మిక కార్యక్రమాలలో యువత చురుకుగా పాల్గొనాలని తెలిపారు. పాండు నాయక్, సక్రు నాయక్, బోడ్యి నాయక్, రమేష్ నాయక్, రవి రాథోడ్, దేవేందర్ నాయక్, శివరాం, గోపి, లాలు, జైపాల్, మణిపాల్, నరేష్, మోతిలాల్, హరిలాల్, శ్రీను, దుద్య, కుభ్యా, సుమన్, వినోద్, మురారి, కుమార్, రమేష్, భాస్కర్, నరేష్, సునీల్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం

-మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి





**ఆమనగల్లు, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం ద్వారా భూ సంబంధ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణిని ప్రతి రైతుకు ఇచ్చిన హామీ మేరకు బంగాళాఖాతంలో కలిపామని, ప్రతి రైతుకు భద్రత కల్పించేలా భూభారతిని అమల్లోకి తెచ్చామని, అందులో భాగంగా రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలంలో సమీకృత భూభారతి పైలట్ ప్రాజెక్టు ఎన్నికైందని మంత్రి అన్నారు. గురువారం ఆమనగల్లు మున్సిపాలిటీ విటాయిపల్లిలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తో కలిసి సమీకృత భూభారతి పోర్టల్ ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈరోజు ప్రతి గ్రామంలో గ్రామ సభలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి మనిషికి ఆధార్ నెంబర్ లాగా భూమి కలిగిన ప్రతి రైతుకు సర్వేనెంబర్ కు భూధార్ నెంబర్ కేటాయిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెవెన్యూ శాఖను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేశామన్నారు. 10572 గ్రామాలకు విఆర్ఎలను నియమించినట్లు, సర్వే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంతో 2 దశల్లో సుమారు 6000 లైసెన్ సర్వేయర్ లను నియమించినట్లు తెలిపారు. భూ భారతి చట్టంలో రిజిస్ట్రేషన్ జరిగే సమయంలోనే ఆ సర్వే నెంబర్ కు సంబంధించిన సరిహద్దులు ఉంటాయని, ప్రతి రైతుకు భూభారతి భరోసా లాంటిది అన్నారు.ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కోరిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి కల్వకుర్తి నియోజకవర్గానికి గృహ నిర్మాణ శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి 3500 ఇందిరమ్మ ఇల్లు కేటాయించారని, 80% మొదటి దశ ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాలు పూర్తయ్యాయని, నియోజకవర్గానికి మరో 3500 ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి మంత్రిని కోరారు. అదేవిధంగా ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ సెక్రటరీ లోకేష్, జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు, ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యాట గీత, మున్సిపాలిటీ చైర్మన్ పత్య నాయక్, తహసీల్దార్ ఖాద్రి, మున్సిపాలిటీ కమిషనర్ శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, అజీమ్ మరియు టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, మెకానిక్ బాబా, జగదీష్, కొండల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# పేదోడికి సొంతిల్లు ప్రభుత్వ సంకల్పం





## -మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ఆమనగల్లు, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పేదోడికి సొంతిల్లు ఉండేలా చూడడమే ప్రజాప్రభుత్వ సంకల్పమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని విఠయిపల్లిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తో కలిసి ఇందిరమ్మ ఇంటిని ఆయన ప్రారంభించి లబ్ధిదారులకు కొత్త బట్టలు బహూకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇళ్లు లేని నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని చెప్పారు. సకాలంలో ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల ఖాతాలో రూ.5 లక్షలను ప్రభుత్వం జమ చేస్తుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఇల్లు లేని ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం దశల భారీగా అమలు చేస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ సెక్రటరీ లోకేష్, జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు, ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యాట గీత, మున్సిపాలిటీ చైర్మన్ పత్య నాయక్, తహసీల్దార్ ఖాద్రి, మున్సిపాలిటీ కమిషనర్ శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, అజీమ్ మరియు టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మండల అధ్యక్షుడు తెల్లమల్ల జగన్, మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, ఆదివాసి రాష్ట్ర నాయకులు కృష్ణ నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, మెకానిక్ బాబా, జగదీష్, కొండల్ రెడ్డి స్థానిక కౌన్సిలర్ అనిత శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# అంబరాన్నంటిన వార్షిక వేడుకలు



**ఆమనగల్లు, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ హై స్కూల్ 25 వార్షికోత్సవ వేడుకలు (సిల్వర్ జూబ్లీ వేడుకలు) భవాని గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి యూకేజీ నుండి ఐదో తరగతి వరకు విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే చేపట్టారు. అనంతరం విద్యా వ్యవస్థలో పాఠశాల చైర్మన్ చుక్క. అల్లాజి గౌడ్ మరియు జిల్లెల్ల సుదర్శన్ రెడ్డి లు విద్య వ్యవస్థలో"40 ఏళ్లు"పూర్తి చేసిన సందర్భంగా సమాజంలో, విద్యా ఉపాధ్యాయ వృత్తిలో, ధార్మిక సంస్థలలో, రాజకీయ రంగాల్లో మరియు సమాజ సేవ లయన్స్ క్లబ్ లో...వీరు చేసిన సేవలను పలువురు వ్యక్తులు కొనియాడారు. ఈ సందర్భంగా ప్రశంస పత్రాలతో, వారిని ఘనంగా సత్కరించారు. విద్యార్థులు నిర్వహించిన సంస్కృతి కార్యక్రమాలు అందరికీ ప్రేక్షకులను అలరించాయి. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు, నాటకాలు విద్యార్థులు చాలా చక్కగా ప్రదర్శించారు. కార్యక్రమంలో సావిత్రి, సుజాత, శ్రీశైలం, యాదయ్య, శ్వేత, అహ్మద్ తదితర ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎలిగేడు మండలంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక



ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలో మాట్లాడుతున్న తహసిల్దార్ యాకన్న పాల్గొన్న స్థానిక సర్పంచ్ కప్పల ప్రవీణ్.



నారాయణ పల్లె లో మాట్లాడుతున్న సర్పంచ్ రంగు లతా శ్రీనివాస్ గౌడ్.



రేకల్దేవ్ పల్లి లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపిస్తున్న సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్



లాలపల్లెలో మాట్లాడుతున్న సర్పంచ్ ఏలేటి వెంకట్ రెడ్డి



ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తున్న రాముల పల్లె సర్పంచ్ సిద్ది తిరుపతి యాదవ్.

## - గ్రామసభలలో ప్రజల ఆవేదన

**ఎలిగేడు, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం ఎలిగేడు మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు జరిగాయి. సభలలో ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. ఎలిగేడు గ్రామసభలో అధికారులు రూ.500కే గ్యాస్ అందిస్తారని చెప్పగా, సబ్సిడీ ఖాతాల్లో పడటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. గ్రామంలో విద్యుత్ ఎక్స్టెన్షన్ పోల్స్, లైజ్ వైర్లను సరిచేయాలని విద్యుత్ ఏఈ సంపత్ కుమార్‌ను సర్పంచ్ ప్రవీణ్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు, కొత్త పింఛన్లు తదితర అంశాలను ప్రజలు గ్రామసభల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కప్పల ప్రవీణ్, వెంకట్రెడ్డి, బాపయ్య, వెంకటేష్ గౌడ్, కొమురయ్య, తిరుపతి యాదవ్, లత, రజిత, రమాదేవి, వాణి, శైలజ, రాధ, గంగా జమున, తహసీల్దార్ యాకయ్య, ఎంపీడీవో భాస్కరరావు, ఎంపీఓ కిరణ్, వివిధ శాఖ అధికారులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మానుకోటలో కన్నుల పండుగగా హనుమాన్ విజయోత్సవ ర్యాలీ

## - కాషాయ జెండాలతో జైశ్రీరామ్ నినాదాలు



**మహబూబాబాద్, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం హనుమాన్ విజయోత్సవ ర్యాలీ ఘనంగా జరిగింది. స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం నుండి హనుమంతుని గడ్డ దేవాలయం వరకు భక్తుల ఆధ్వర్యంలో శోభాయాత్ర కొనసాగింది. కాషాయ జెండాలతో భారీగా పాల్గొన్న భక్తులు రామనామ స్మరణతో ర్యాలీని ఉత్సాహంగా ముందుకు నడిపారు. హనుమంతుని పాటలతో, జైశ్రీరామ్ నినాదాలతో పట్టణమంతా మార్మోగింది. కార్యక్రమాన్ని ఉద్దేశించి పలువురు వక్తలు మాట్లాడుతూ, "హనుమంతుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి. ప్రతి ఒక్కరి జీవితంలో విజయోత్సవం వెలుగులు నింపాలి" అని శుభాకాంక్షలు తెలిపారు. ఈ శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పట్టణాన్ని భక్తి శ్రద్ధలతో నింపారు.

# దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ చేసిన ఎమ్మెల్యే మురళి నాయక్



**మహబూబాబాద్, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో గురువారం ఎమ్మెల్యే మురళి నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "జిల్లాలో 24,105 మంది దివ్యాంగులు ఉన్నారు. వారి ఆర్థిక, సామాజిక పరిస్థితులు మెరుగుపరచి, మనోధైర్యం నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది" అని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత నెలకు రూ.4016 పింఛన్లు, ఎకనామిక్ రిహాబిలిటేషన్ స్కీంలో 100% సబ్సిడీ బోన్లు, దివ్యాంగుల వివాహాలకు లక్ష రూపాయల సాయం, రిట్రో ఫిట్టెడ్ మోటార్ వాహనాలు, ల్యాప్‌టాప్‌లు, 5+ స్మార్ట్‌ఫోన్లు, బ్యాటరీ వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు అందజేస్తున్నట్లు వివరించారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో కూడా ఈ పథకాల అమలు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పాత్రికేయులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు

**కరీంనగర్, ఏప్రిల్ 02(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు. సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించాలంటే సంబంధిత ఏసీపీ అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం పై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను ఈ నెల 30 వరకు పొడిగించినట్లు కమిషనర్ తెలిపారు. మద్యం సేవించి అసభ్య పదజాలం ఉపయోగించడం ప్రజలకు ఇబ్బందిగా మారిందని, భద్రత కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. భద్రతా కారణాల దృష్ట్యా



డ్రోన్లు, పారాగ్లైడర్స్, మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్ వినియోగాన్ని కూడా ఈ నెల 30 వరకు నిషేధించారు. వివాహాలు, ఇతర కార్యక్రమాల్లో వీటిని వినియోగించే అవకాశం ఉన్నప్పటికీ అసాంఘిక శక్తులు దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని తెలిపారు. వినియోగించాలనుకుంటే ముందస్తు అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. డీజే సౌండ్ వినియోగంపై కూడా నిషేధాజ్ఞలను పొడిగించారు. శబ్ద కాలుష్యం వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని కమిషనర్ పేర్కొన్నారు. నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే ఐపిసి 188 మరియు హైదరాబాద్ నగర పోలీస్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కొండగట్టుకు బయలుదేరిన హనుమాన్ భక్తులు





**ఎలిగేడు, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హనుమాన్ జయంతి సందర్భంగా ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన భక్తులు గురువారం కొండగట్టుకు బయలుదేరారు. 21 రోజులు హనుమాన్ మాల వేసి భక్తి భజనలో ఆధ్యాత్మికంగా గడిపిన భక్తులు ఇరుముడి కట్టుకొని మాల విరమణ అనంతరం అంజన్న స్వామి దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సకాలంలో పండాలని హనుమాన్ భక్తులు ప్రార్థించారు.

# ఆర్టీజన్ కార్మికులకు ఎపిఎస్ఈబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని జేఏసీ డిమాండ్



**పెద్దపల్లి, ఏప్రిల్ 02(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి ఎస్ఈ కార్యాలయం ముందు గురువారం తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్, ఆన్ మ్యాన్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా చైర్మన్ మల్ల కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టిజన్స్ కార్మికులకు స్టాండింగ్ ఆర్డర్ రద్దు చేసి ఎపిఎస్ఈబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని, ఆన్ మ్యాన్ కార్మికులను ఆర్టిజన్స్‌గా గుర్తించి సంస్థలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. మీటర్ రీడర్స్, పీస్ రేటు కార్మికులందరికీ జీ ఓ 11 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. ఇప్పటికే రెండు సార్లు సర్కిల్ ఆఫీస్ ముందు వంట వార్పు నిర్వహించినా యాజమాన్యం స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే డిమాండ్లు నెరవేర్చకపోతే ఈ నెల 7న టీజీఎన్పీడిసిఎల్ కంపెనీ ముట్టడి చేస్తామని, 8 నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధమని హెచ్చరించారు. ఆందోళనలో జేఏసీ నాయకులు మల్ల కిషన్ రెడ్డి, ఎల్లయ్య, దాసరి కోటి, గోపతి తిరుపతి, ఆది కొండల్, రాపోలు సురేష్, ఖలీం, భాస్కర్, ఆన్ మ్యాన్ జిల్లా అధ్యక్షులు ఇరుగురాల రమేష్, వెంకటేష్, హజర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ సభ కార్యక్రమం



**పెద్దపల్లి, ఏప్రిల్ 02(నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఓదెల మండలం రూపునారాయణపేట గ్రామపంచాయతీ ఆవరణలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గ్రామ సభ జరిగింది. సభలో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పాల్గొన్నారు. విజయరమణ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గ్యాస్ సిలిండర్‌ను 500 రూపాయలకు అందించడం, సన్నరకం వడ్ల కొనుగోలు బోనస్, చేయూత పెన్షన్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కళ్యాణలక్ష్మి--షాది ముబారక్ చెక్కులు, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలను వివరించారు. అదనంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహారం--మధ్యాహ్న భోజనం, దివ్యాంగ విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాల పంపిణీ వంటి కొత్త పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, ఎంపీడీఓ, గ్రామ సర్పంచ్ బొంగోని రమ శ్రీనివాస్, ఉపసర్పంచ్ జిలుక స్వప్న సంతోష్, మండల అధ్యక్షుడు మూల ప్రేమ్ సాగర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# బాలల రక్షణకు ప్రతి ఒక్కరి కృషి అవసరం



బాలల పరిరక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మండల అభివృద్ధి అధికారి భాస్కర్ రావు.



బాలల పరిరక్షణ కరపత్రాలను విడుదల చేస్తున్న అధికారులు

**- ఎలిగేడు మండలంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం**

**ఎలిగేడు, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బాలల పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డీసీపీయూ యూనిట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ నిర్మల, చైల్డ్రన్ కోఆర్డినేటర్ ఉమాదేవి పిలుపునిచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎలిగేడు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు పై ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాల్యవివాహాలు, బాల కార్మికత్వం, బడిమానేసిన పిల్లలు, అనాథ పిల్లలు, బాలల అక్రమ రవాణా, బాలలపై వేదింపులను అరికట్టేందుకు కమిటీ చురుకైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాలల హక్కులను పరిరక్షించాలని కోరారు. ఎలిగేడు మండలాన్ని బాలల హృదయపూర్వక మండలంగా అభివృద్ధి చేయడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి బాలల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కరరావు, మెడికల్ ఆఫీసర్ నిస్సి క్రిస్టిన్, ఏసీడీపీఓ సంపద కుమారి, ఐసిడిఎస్ సూపర్వైజర్ సూర్యకళ, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పోలీసు అధికారులు, చైల్డ్ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ కే. హైమావతి



**సిద్దిపేట, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, అన్నం, పప్పు, కూరల నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఆహారం వండలేదని హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల భోజనం, వసతి, చదువులో రాజీ పడవద్దని ఉపాధ్యాయులకు సూచించారు. తరువాత కొండపాక మండలం దుద్దెడ గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక గ్రామసభలో కలెక్టర్ పాల్గొన్నారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని చదివి వినిపించి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, గృహజ్యోతి, మహాలక్ష్మి వంటి పథకాల లబ్ధిదారులు తమ అనుభవాలను పంచుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 508 గ్రామపంచాయతీలలో గ్రామ సభలు, ఐదు మున్సిపాలిటీలలో వార్డు సభలు జరుగుతున్నాయని తెలిపారు. పేద ప్రజల అభివృద్ధి కోసం మౌలిక వసతులు కల్పించడం, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, రైతు భరోసా, విద్యార్థులకు పౌష్టికాహారం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, అల్పాహారం పథకాలు, దివ్యాంగ విద్యార్థులకు వాహన సౌకర్యం, కుటుంబ జీవిత బీమా వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎంపీడీవో, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ డా. భాస్కర్ మడేకర్ చారిటబుల్ కంటి ఆసుపత్రికి నూతన ట్రస్ట్ బోర్డు నియామకం



**కరీంనగర్, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ రేకుర్తి ప్రాంతంలో సేవలందిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ డా. భాస్కర్ మడేకర్ చారిటబుల్ కంటి ఆసుపత్రికి నూతన ట్రస్ట్ బోర్డు సభ్యులను నియమించారు. చైర్మన్‌గా ప్రకాష్ హోల్లా, కార్యదర్శిగా ఇంజనీర్ కోల అన్నారెడ్డి, ఖజాంచీగా బొమ్మ పవన్ కుమార్, ఉపాధ్యక్షుడిగా చిదుర సురేష్, సభ్యులుగా కొండ వేణు మూర్తి, డాక్టర్ టీ. మురళీధర్ రావు బాధ్యతలు స్వీకరించారు. నూతన ట్రస్ట్ బోర్డు సభ్యులు మాట్లాడుతూ సమాజంలోని పేద మరియు అవసరమైన వర్గాలకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన కంటి వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఆసుపత్రి ద్వారా మరిన్ని ఉచిత కంటి పరీక్షా శిబిరాలు నిర్వహించడం, గ్రామీణ ప్రాంతాల్లో సేవలను విస్తరించడం, కంటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు కొత్త ట్రస్ట్ బోర్డు సభ్యులకు అభినందనలు తెలియజేసి, వారి నాయకత్వంలో మరిన్ని సేవా కార్యక్రమాలు విజయవంతం అవుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**- కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ రూరల్ మండలం నగునూరులో జరిగిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక గ్రామసభలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని, సమస్యల పరిష్కారానికే గ్రామసభలను ప్రభుత్వం నిర్వహిస్తోందని తెలిపారు. ప్రభుత్వం 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికను ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని, ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, సన్న బియ్యం, పింఛన్లు వంటి పథకాల లబ్ధిదారుల వివరాలను అధికారులు గ్రామసభల్లో వెల్లడిస్తారని తెలిపారు. పథకాల అమలులో ఇబ్బందులు ఉంటే ప్రజలు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామసభలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి, ప్రజలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ మహేశ్వర్, తహసిల్దార్ నర్సింగరావు, సర్పంచ్ సాయిళ్ళ శ్రావణి, పలువురు అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లాలో విజయవంతంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలు

**మానకొండూర్, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లాలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక గ్రామసభలు, వార్డు సభలు గురువారం విజయవంతంగా జరిగాయి. గ్రామాలు, వార్డుల్లో నిర్వహించిన సభలకు ప్రజలు, సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, అధికారులు, స్వశక్తి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా నగునూరు గ్రామసభలో పాల్గొని ప్రజలకు కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించారు. పాలన యంత్రాంగం ప్రజల వద్దకే వచ్చి సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తమ నియోజకవర్గాల్లో జరిగిన గ్రామసభల్లో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. జిల్లాలో 318 గ్రామపంచాయతీల్లో గ్రామసభలు, 66 డివిజన్లలో వార్డు సభలు ప్రశాంతంగా జరిగాయి. సభల్లో వైద్య శిబిరాలు, వ్యవసాయ శాఖ భూసార పరీక్షలు, అంగన్వాడీ






పిల్లలకు యూనిఫామ్ పంపిణీ, గ్రామ బాలల పరిరక్షణ కమిటీ బోర్డుల ఏర్పాటు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక కళాకారులు ఆటపాటలతో ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి 1320 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. మొత్తం మీద కరీంనగర్ జిల్లాలో గ్రామసభలు, వార్డు సభలు విజయవంతంగా జరిగాయి.

# శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో డిగ్రీ పరీక్షల ప్రణాళిక విడుదల




**కరీంనగర్, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో బిఏ, బీకాం, బీఎస్సీ సహా అన్ని డిగ్రీ (యూ.జి) కోర్సుల రెండవ, నాలుగవ, ఆరవ సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 15 నుంచి మే 6 వరకు జరగనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ డి. సురేష్ కుమార్ తెలిపారు. విద్యార్థులు ఇతర వివరాల కోసం విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ లేదా ఆయా కళాశాలలను సంప్రదించాలని సూచించారు.

# కనుల పండుగగా సహస్ర దీపారాధన అమ్మవారికి పల్లకి, ఉయ్యాల సేవలు




**కరీంనగర్ రూరల్ , ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పౌర్ణమి సందర్భంగా కరీంనగర్ నగునూరులోని శ్రీ దుర్గాభవానీ దేవాలయంలో గురువారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పల్లకి సేవ, సహస్ర దీపారాధన, ఉయ్యాల సేవలు నిర్వహించారు. విశేష హారతులు, పూజా కార్యక్రమాలు కనుల పండుగలా సాగాయి. ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్, చైర్మన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల నిండైన భక్తి, దీపాల వెలుగులు, పల్లకి సేవలతో ఆలయం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతి వేడుకలు

**కరీంనగర్, హుస్నాబాద్, మానకొండూర్ -- ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ బహుజన వీరుడు, గోల్కొండ కోటను పరిపాలించిన తొలి రాజు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 316వ వర్ధంతి సందర్భంగా కరీంనగర్, హుస్నాబాద్, మానకొండూర్ ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్, సర్వాయిపేట గ్రామాల మధ్య కొమ్ముగుట్ట వద్ద, అలాగే పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన బహుజనుల హక్కుల కోసం చేసిన పోరాటాన్ని నాయకులు స్మరించుకున్నారు. కేవలం 12 మంది సైనికులతో మొగల్ సామ్రాజ్యంపై పోరాటం ప్రారంభించి, 12 వేల సైన్యాన్ని సమీకరించి గోల్కొండ కోటను జయించిన ధైర్యసాహసాలను గుర్తుచేశారు. కరీంనగర్ టౌన్‌లో కలెక్టర్ ఆడిటోరియం, మానేరు డ్యాం సమీపంలోని విగ్రహం వద్ద కూడా కార్యక్రమం జరిగింది. ఆర్డీవో మహేశ్వర్ గౌడ్, ఎమ్మార్వో కాళీచరణ్, జిల్లా అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. సైదాపూర్ మండలం







సర్వాయిపేటలో పాపన్న విగ్రహం టూరిజం పార్క్ కోసం రూ. 4.70 కోట్లు కేటాయించి పనులు పూర్తి చేసినట్లు, ట్యాంక్‌బండ్ వద్ద కూడా విగ్రహం నిర్మించనున్నట్లు తెలిపారు. మానకొండూర్‌లో అల్గునూర్ పురానాపూల్ వద్ద గౌడ సంక్షేమ సంఘం నాయకులు పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన పోరాట స్ఫూర్తి బహుజనుల ఆత్మగౌరానికి ప్రతీక అని, ఆయన ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఆయన చూపిన నాయకత్వ లక్షణాలు నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో గౌడ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలను స్మరించారు. ఆయన పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు.

# కవిత సమక్షంలో తెలంగాణ జాగృతిలో భారీ చేరికలు

**కరీంనగర్, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్ కేంద్ర కార్యాలయంలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అధ్యక్షతన ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన తెలంగాణ జాగృతి రాజకీయ శక్తిగా ఆవిర్భవించనున్న సందర్భంగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆవిర్భావ సభను విజయవంతం చేయడానికి కరీంనగర్ జిల్లా నుండి పెద్ద ఎత్తున నాయకులు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జాగృతి రాష్ట్ర భవిష్యత్తును మార్చే రాజకీయ శక్తిగా ఎదుగుతుందని, ప్రజా సమస్యల పరిష్కారానికి నాయకులు మరింత కృషి చేయాలని సూచించారు. గత ఇరవై సంవత్సరాలుగా జాగృతి ప్రజల సమస్యల పరిష్కారం, తెలంగాణ సంస్కృతి--సాంప్రదాయాల పరిరక్షణ కోసం కృషి చేసిందని, రానున్న రోజుల్లో కూడా ప్రజల కష్టాల్లో భాగస్వామ్యం కావాలని, సమస్యలపై ప్రశ్నించి పోరాడి పరిష్కారం సాధించాలనే సిద్ధాంతాలతో ముందుకు సాగాలని అన్నారు. ఈ సందర్భంగా జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు యువకులు, మహిళలు




జాగృతిలో చేరారు. వారిలో మడిపల్లి వినీత్ కుమార్, ఎండి తాజ్, పూసాల రణధీర్, రాగటి జీవన్, ముప్పా విజయ్, మహిళా నాయకురాలు గాజుల నవ్య, కొలగాని మాధవి, కుతాడి రజిత, పల్లె శారదా, అసియా సుల్తానా తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల తిరుపతి, మహిళా విభాగం అధ్యక్షురాలు అంకం శివరాణి, ఆదివాసి విభాగం అధ్యక్షుడు ఉదాడు శ్రీనివాస్, బీసీ విభాగం అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, బుడిగే పరచరాములు, గౌడ్ బాసర రాజేందర్, జంగా అపర్ణ, ఎండి సల్మా బాషా, టి. కృష్ణవేణి, కాంతాల రోజా రెడ్డి, బండ అశోక్, సంతోష్ యాదవ్, గాలిపల్లి రత్నాకర్, చారి ఘర్షకృతి విద్యాసాగర్, ఐలేష్, గుండేటి తిరుపతి, పిట్టల సత్యం, పుల్లూరు అంజలి, పొన్నం శిరీష తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు




**పాలకుర్తి, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాలకుర్తి మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. వేకువజామున ఆలయాల్లో అర్చకులు ఆంజనేయస్వామి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం చేసి హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కొబ్బరికాయలు కొట్టి స్వామిని దర్శించుకున్నారు. దాతలు భక్తులకు అన్నప్రసాదం, తీర్థప్రసాదాలు అందించారు. జై శ్రీరాం, జై హనుమాన్ నినాదాలతో ఆలయాలు మార్మోగాయి. హనుమాన్ మాలధారణ చేసిన స్వాములు దీక్ష ముగింపు సందర్భంగా జయంతి వేడుకల్లో పాల్గొని మాల విరమణ చేశారు. కొందరు పాదయాత్రగా, మరికొందరు వాహనాల ద్వారా కొండగట్టు దేవస్థానానికి బయలుదేరి వెళ్లారు. భక్తుల ఉత్సాహం, ఆధ్యాత్మిక వాతావరణం, హారతులు, దీపారాధనలతో హనుమాన్ జయంతి వేడుకలు కనుల పండుగగా మారాయి.

# భగత్ నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం సమక్షంలో చలివేంద్రం



**కరీంనగర్, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ భగత్ నగర్ ఆర్యవైశ్య అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో, కొల్లూరి హరిప్రసాద్ అధ్యక్షతన చలివేంద్రం ఏర్పాటు చేశారు. భగత్ నగర్ ఆర్యవైశ్యుల సహకారంతో ఇది మూడవ సంవత్సరం కొనసాగుతున్న మానవసేవ కార్యక్రమమని, మానవసేవే మాధవసేవ అనే భావంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిదుర సురేష్, నూనె విద్యాసాగర్, కొండూరి ప్రసాద్, అల్లాడి రంగయ్య, రావికంటి సత్యనారాయణ, శ్రీనివాస గాంధీ, రామకృష్ణ, వైకుంఠం శ్రీనివాసు, వెంకటేశం, సుధాకర్, చంద్రమౌళి, మహేష్, రాజేందర్, రామచంద్రన్, శంకరయ్య, ఆంజనేయులు, రమేష్, ఏలూగూరి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు. భగత్ నగర్ కుటుంబ సభ్యులు కూడా పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు హరిప్రసాద్ అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# మానసిక ఆందోళనతో మహిళ ఉరివేసుకొని మృతి



**గంగాధర, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురానగర్ గ్రామానికి చెందిన దూస లత (45) తన నివాసంలో ఉరివేసుకుని మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న వెంటనే గంగాధర ఎస్సై వంశీకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితులను పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ప్రకారం, లత గత సంవత్సరం కాలంగా మానసిక సమస్యలతో బాధపడుతూ చికిత్స పొందుతున్నా నయం కాలేదని తెలిపారు. నిన్న సాయంత్రం వరకు బాగానే ఉన్న ఆమె ఈ ఉదయం గది తలుపు తీయకపోవడంతో భర్త శంకరయ్య అనుమానం చెంది తలుపు పగులగొట్టి చూడగా, కిటికీ వైర్‌తో ఉరివేసుకుని మృతి చెందినట్లు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు గంగాధర ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

# ఘనంగా హనుమాన్ జన్మోత్సవ వేడుకలు



**ఆమనగల్లు, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శ్రీ హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా ఆమనగల్లు అంగడి బజార్‌లోని శ్రీ హనుమాన్ దేవాలయంలో గురువారం ఉదయం 6.30 గంటలకు అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకులు రామకృష్ణ అయ్యగారు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో ఆలయం మారుమోగింది. ఈ కార్యక్రమంలో నాగిళ్ళ జగన్, పాతకోట శ్రీశైలం, జెజ్జాల ఆనంద్, దాస్యం వంశీ, ముఖ్యరి వెంకటేష్, కోట్ల వెంకటేష్, లండం మల్లేష్, నరేష్, రామకృష్ణతో పాటు అనేక మంది భక్తులు పాల్గొన్నారు. భక్తుల భక్తిశ్రద్ధలతో ఆలయం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయి హనుమాన్ జన్మోత్సవం కనుల పండుగగా జరిగింది.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే మా లక్ష్యం

**- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్**

**పాలకుర్తి, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాలకుర్తి మండలంలోని 16 గ్రామపంచాయతీలలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామ సర్పంచుల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాలకు రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను గ్రామస్థాయిలోనే చర్చించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కు గ్యాస్ సిలిండర్, సన్నరకం వడ్లకు బోనస్, గృహజ్యోతి వంటి పథకాలు అమలు



చేస్తున్నట్లు వివరించారు. అదే రోజు రామారావుపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో గృహలక్ష్మి పథకం కింద నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేశారు. షేర్ల అనిత రాజయ్య, షేర్ల శంకరమ్మ మల్లేష్ లకు చెందిన ఇళ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ శశికళ, ఎమ్మార్వో సునీత, సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాభివృద్ధి అంశాలు, ప్రభుత్వ పథకాలపై లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించి, ప్రజల సూచనలు స్వీకరించారు. మొత్తానికి పాలకుర్తి మండలంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక గ్రామసభలు విజయవంతంగా జరిగి, పేదల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించారు.

# ఎమ్మెల్యే గంగుల కమలాకర్ సమక్షంలో ఘనంగా జై భీమ్ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

**కరీంనగర్, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో ఈ నెల 14న జరగనున్న జై భీమ్ యాత్ర పోస్టర్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ మాసం మహనీయులైన బాబా సాహెబ్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబాపూలే, బాబు జగ్జీవన్ రామ్ వంటి మహానుభావులు జన్మించిన పవిత్ర మాసమని, కులమతాలకతీతంగా ప్రజలందరూ వారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. వారి ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రాజ్యాంగం పటిష్ట స్థితిలో ఉండడానికి కారణం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని, ఆయన కృషి వల్లే ప్రజాస్వామ్య పద్ధతిలో నాయకులను ఎన్నుకునే అవకాశం లభించిందని అన్నారు. మన రాజ్యాంగాన్ని చూసి పలు దేశాలు తమ రాజ్యాంగాలను రచించుకున్నాయని



గుర్తుచేశారు. ఏప్రిల్ 14న సాయంత్రం జరిగే జై భీమ్ యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు, నగర బిఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, ఏనుగు రవీందర్ రెడ్డి, కార్పొరేటర్ గడ్డి ప్రదీప్, కొత్తపల్లి మాజీ వైస్ ఎంపీపీ తిరుపతి నాయక్, మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ కర్ర సూర్యశేఖర్, మాజీ సుడా డైరెక్టర్ నేతి రవివర్మ, నాయకులు మిడిదొడ్డి నవీన్, అంబేద్కర్ యూత్ సభ్యులు కొమ్ముల కరుణాకర్, లింగంపెల్లి రాజేష్, పులిపాక సాయికుమార్, కళ్ళపెల్లి నవీన్, గసికంటి దీపక్, బోనా సాగర్, మల్యాల కిరణ్, వేదిర వామన్, దాసరపు వంశీ ప్రణయ్, మడక అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో పలు డివిజన్లో సమస్యలపై సభలు



**కరీంనగర్, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కరీంనగర్ నగరంలోని పలు డివిజన్లలో గురువారం వార్డు సభలు నిర్వహించబడ్డాయి. కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్ నూతన గ్రామపంచాయతీ కార్యాలయంలో 6వ డివిజన్ వార్డు సభ జరిగింది. కార్పొరేటర్ మేకల వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు.



వృద్ధులకు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, వీధి కుక్కల సమస్య, బెల్టు షాపులపై ఫిర్యాదులు ప్రధానంగా వచ్చాయని కార్పొరేటర్ తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రజల సహకారంతో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంగన్వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ 36వ డివిజన్ పరిధిలోని మారుతీనగర్ చౌరస్తా వద్ద కూడా వార్డు సభ జరిగింది. కార్పొరేటర్ తోట అనిల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో అధికారులు ప్రభుత్వం అందిస్తున్న ఆరు గ్యారంటీల అమలు తీరును ప్రజలకు వివరించారు. మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు వంటి పథకాలపై చర్చ జరిగింది. డ్రైనేజీ సమస్యలు, సిసి రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు వంటి అభివృద్ధి అంశాలపై ప్రజల వినతులు స్వీకరించారు. పారిశుధ్య నిర్వహణలో ప్రజల సహకారం అవసరమని అధికారులు సూచించారు. అదే రోజు 40వ డివిజన్ హనుమాన్ నగర్, తిరుమల నగర్ పరిధిలో జరిగిన వార్డు సభలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు ప్రజలను వీధి కుక్కలు, కోతుల బెడద నుండి కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. చిన్నపిల్లలు స్కూలుకు వెళ్లే సమయంలో కోతులు బ్యాగులు గుంజడం, కుక్కలు వెంటపడడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వీధి కుక్కల దాడి వల్ల ఒకరు మరణించారని, అయినా అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజల చేత ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ వార్డు సభల్లో మున్సిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్లు, అంగన్వాడీ, ఆశా సిబ్బంది, ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని పరిష్కరించేందుకు అధికారులు హామీ ఇచ్చారు.

# భక్తుల సందడితో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు





**మహేశ్వరం, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జీహెచ్ఎంసీ పరిధిలోని బాలాపూర్ డివిజన్‌లో హనుమాన్ జయంతి సందర్భంగా పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, బాలింగని జంగయ్య, పగడాల ఉమేష్ పాల్గొన్నారు. అదే రోజు బాలాపూర్ చౌరస్తాలో బీజేవైఎం నాయకుడు రాఘవేందర్ గౌడ్ నిర్వహించిన హనుమాన్ జయంతి కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారి ఆశీర్వాదం తీసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ నిర్వహించిన కార్యక్రమానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకల్లో మాజీ కార్పొరేటర్, మీర్పేట్ జనరల్ సెక్రటరీ ఇంద్రావత్ రవి నాయక్, సీనియర్ నాయకుడు గాజుల మధు, గోరక్షకుడు శ్రావణ్ పాల్గొన్నారు. వెంకటాపూర్--కొత్తపేట సరిహద్దులోని పురాతన శ్రీ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో కూడా హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ప్రముఖులకు స్వామివారి తీర్థప్రసాదం అందజేసి, శాలువాలతో సత్కరించారు. భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. గ్రామ ప్రజలు, నాయకులు, భక్తులు కలిసి ఉత్సవాలను విజయవంతం చేశారు. రామ లక్ష్మణ జానకి జై బోలో హనుమాన్ కి నినాదాలతో ఆలయాలు మారుమోగాయి.

# చండూరులో ఘనంగా వార్డు సభలు ప్రజా సమస్యలపై నేరుగా స్పందించిన అధికారులు



**చండూరు, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చండూరు మున్సిపాలిటీలో "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ)"లో భాగంగా వార్డు సభలు గురువారం విజయవంతంగా నిర్వహించబడ్డాయి. శీలా అనసూయ శంకర్ రావ్ గార్డెన్స్ మరియు అంగడిపేట వార్డ్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ సమావేశాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అటవీ, విద్యుత్, వ్యవసాయ, రెవిన్యూ, పోలీస్, సామాజిక సంక్షేమ, ఆరోగ్య మరియు విద్య శాఖల ప్రతినిధులు కూడా సభలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, ప్రజల సమస్యలను నేరుగా వినడం, అభివృద్ధి కార్యక్రమాల్లో పారదర్శకతను పెంపొందించడం ప్రధాన లక్ష్యాలుగా పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, మౌలిక వసతుల అభివృద్ధి, డ్రైనేజ్, రోడ్లు, వీధి దీపాలు, పింఛన్లు, సంక్షేమ పథకాల అమలు, పన్నుల చెల్లింపుపై అవగాహన వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఆర్డీవో శ్రీదేవి మాట్లాడుతూ లింగ సమానత్వం ప్రాముఖ్యతను వివరించి, చిన్నప్పటి నుంచే పిల్లల్లో ఆ భావన పెంపొందించాలని సూచించారు. చైర్మన్ కోడి శ్రీనివాసులు పట్టణాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, పందుల సమస్యను పూర్తిగా నిర్మూలిస్తామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం అభివృద్ధి మరియు సంక్షేమ పథకాల అమలుపై వివరించారు. సీఐ ఆదిరెడ్డి యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మైనర్లు వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. అటవీ శాఖ అధికారులు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించగా, చేనేత జౌళి శాఖ అధికారులు 120 మంది కార్మికులకు రూ.98 లక్షల రుణమాఫీ జరిగినట్లు తెలిపారు. సోషల్ వెల్ఫేర్ అధికారులు విద్యార్థుల కోసం ఉన్న వసతి, విద్యా సదుపాయాలపై అవగాహన కల్పించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారులకు తెలియజేయగా, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు ప్రజల సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్డీవో శ్రీదేవి, మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం, వైస్ చైర్మన్ భూతరాజు దశరథ, కౌన్సిలర్లు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శ్రీకాశీ విశ్వేశ్వర దేవస్థానంలో హనుమాన్ జయంతి

**ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్.**



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వరంగల్ తూర్పు నియోజకవర్గం కాశిబుగ్గలోని శ్రీకాశీ విశ్వేశ్వర దేవస్థానంలో హనుమాన్ జయంతి పురస్కరించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో అర్చకులు నిర్వహించిన108 హనుమాన్ చాలీసా మహా పారాయణం వేడుకలో బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులతో నగర ప్రజలకు ఆరోగ్యం, శక్తి, విజయం ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, బిజెపి జిల్లా నాయకులు పైర్ధ ఆనంద్, ఎరుకల రఘునారెడ్డి, గుర్రాల సత్యనారాయణ, రాఘవాచారి , మండల నాయకులు ముచర్ల ప్రభాకర్, మామిడాల సతీష్, చింతానూరి రాము, కందుకూరి శ్రీనివాస్, గడ్డం భాస్కర్, బీజేవైఎం జిల్లా నాయకులు ఆదేపు రవిరామ్ పాల్గొన్నారు.

# పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

**పాలడుగు ప్రభావతి,జిల్లా ప్రధాన కార్యదర్శి**



**నల్గొండ,ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వంటింటి గ్యాస్ ధరలను యుద్ధం పేరుతో పెంచడం అన్యాయమని, వెంటనే తగ్గించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి డిమాండ్ చేశారు. ఈ రోజు నల్లగొండ మండలం అనంతారం గ్రామంలో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ధరలు అమాంతం పెరిగిపోయాయని, దీంతో సామాన్య ప్రజలు తినలేని, కొనలేని పరిస్థితుల్లోకి నెట్టబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలను గాలికొదిలేసి, ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేశారని ఆమె విమర్శించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని పేర్కొన్నారు. మహిళలకు నెలకు రూ.2500, విద్యార్థులకు స్కూటీలు, ఉచిత విద్య మరియు వైద్యం అందించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, మురికి కాలువలు వంటి మౌలిక వసతులు అభివృద్ధి చెందకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారంలోకి వచ్చినప్పటి నుండి పెండింగ్ బిల్లులు కూడా చెల్లించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మహిళలంతా ఐద్వా సంఘంలో సభ్యులుగా చేరి, తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు, పోరాటాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి కొండ అనురాధ, శాఖ కార్యదర్శి కమ్మపాటి లక్ష్మి, అధ్యక్షురాలు వెలుగు పున్నమ్మ, నాయకురాలు రుద్రాక్ష హేమలత, నాంచారమ్మ, యాదమ్మ, పార్వతమ్మ, అంజమ్మ, అలివేలు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ ఆలయంలో తేనెటీగల కలకలం



**కరీంనగర్, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరంలోని జ్యోతినగర్ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో గురువారం ఉదయం హనుమాన్ జయంతి వేడుకల సమయంలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఆలయంలో ప్రసాదాల తయారీ కోసం వంటలు జరుగుతుండగా వెలువడిన పొగ కారణంగా సమీపంలోని చెట్టుపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా చెల్లాచెదురయ్యాయి. ఈ క్రమంలో అవి అక్కడ ఉన్న భక్తులపై దాడి చేశాయి. తేనెటీగల దాడిలో ఐదుగురు భక్తులు గాయపడ్డారు. ఈ ఘటనను గమనించిన ఆలయ నిర్వాహకులు, స్థానికులు వెంటనే అప్రమత్తమై గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించారు. సకాలంలో స్పందించడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని, ప్రస్తుతం భక్తులందరూ సురక్షితంగా ఉన్నారని నిర్వాహకులు తెలిపారు. జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో ఆలయం మారుమోగుతున్న వేళ ఈ సంఘటన భక్తులను కాసేపు భయాందోళనకు గురి చేసింది.

# అటవీశాఖ శిక్షణలో సత్తా చాటిన పెద్దపల్లి జిల్లా అధికారి




**పెద్దపల్లి, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పెద్దపల్లి జిల్లాలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ స్ట్రైక్ ఫోర్స్‌లో పనిచేస్తున్న ఎస్.డి. రహిమతుల్లా ఇటీవల జరిగిన అటవీశాఖ శిక్షణలో అసాధారణ ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. ఉద్యోగ పదోన్నతి కోసం మూడు నెలల పాటు హైదరాబాద్‌లోని దూలపల్లి ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన 8వ బ్యాచ్ ఎఫ్ఎస్‌వో (పీ) శిక్షణలో ఆయన నాలుగు బంగారు పతకాలు సాధించి జిల్లాకు కీర్తి తెచ్చారు. ఫారెస్ట్ సర్వే, మెన్సురేషన్ & ఇంజినీరింగ్, సిల్వికల్చర్, ఫారెస్ట్ రీసెర్చ్ & అటవీ ఉత్పత్తులు, జీవనోపాధి, ప్లాంటేషన్ ఫారెస్ట్రీ & సోషల్ ఫారెస్ట్రీ, వైల్డ్ లైఫ్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన చేసి గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. శిక్షణ ముగింపు సందర్భంగా ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (ఐఎఫ్ఎస్) డా. సి. సువర్ణ, సీసీఎఫ్ చార్మినార్ సర్కిల్ & డైరెక్టర్ డా. ప్రియాంక వర్గీస్ చేతుల మీదుగా ఈ బంగారు పతకాలను అందుకున్నారు. రహిమతుల్లా సాధించిన ఈ విజయాన్ని జిల్లా అటవీ అధికారి సీహెచ్ శివయ్యతో పాటు ఇతర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

# కొండపాక మండలానికి నీటి విడుదలకు కృషి చేయాలని వినతి



**కొండపాక, ఏప్రిల్ 02 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొండపాక మండలంలోని పలు గ్రామాల్లో పంటలు నీరు లేక ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో రెండో విడతలో భాగంగా తపస్పల్లి రిజర్వాయర్ నుండి డి4 కెనాల్ ద్వారా కొండపాక మండలానికి నీటి విడుదల జరగాలని అనంతుల ప్రశాంత్ వినయ్ బాబు, అంజయ్యను కలిసి కోరారు. మండలంలోని అన్ని గ్రామాలకు నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చిట్టి నరసింహారెడ్డి, సింగాటం రాములు, మంతెన నాగరాజు, రేపాక స్వామి (హిటాచి)తో పాటు రైతులు పాల్గొన్నారు. రైతులు పంటలు రక్షించుకునేలా తక్షణమే నీటి విడుదల జరగాలని, లేకపోతే తీవ్ర నష్టాలు వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# బిజినెస్


## నష్టాల్లో ప్రారంభమై లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. బలపడ్డ రూపాయి



భారతీయ స్టాక్ మార్కెట్లు గురువారం స్వల్ప లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన మార్కెట్లు క్లోజింగ్ సమయానికి కాస్త పుంజుకుని, స్వల్ప లాభాలతో ముగిశాయి. ఉదయం ఒక దశలో ఏకంగా రూ.10 లక్షల కోట్లు మార్కెట్ నష్టపోయింది. ఇరాన్‌కు ట్రంప్ చేసిన హెచ్చరికలు మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. సెన్సెక్స్ ఉదయం 72,262.05 పాయింట్ల వద్ద భారీ నష్టంతో ప్రారంభమైంది.అంతకుముందు రోజు మార్కెట్ 73,134.32 వద్ద ముగిసింది. అంటే దాదాపు 900 పాయింట్ల నష్టంతో గురువారం ట్రేడింగ్ మొదలైంది. ఇంట్రాడేలో ఇంకా నష్టపోయి ఏకంగా 71,545.81 స్థాయికి పడిపోయింది. ఆ తర్వాత నెమ్మదిగా కోలుకున్న సెన్సెక్స్ ట్రేడింగ్ ముగిసే సమయానికి 185.23 పాయింట్ల (0.25 శాతం) లాభంతో 73,319 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 కూడా ఒక దశలో 496 పాయింట్లు నష్టపోయింది. తర్వాత 33.70 పాయింట్లు (0.15 శాతం) కోలుకుని 22,713 వద్ద ముగిసింది. ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్, యుద్ధం ముగియడానికి రెండు వారాలు సమయం పడుతుందని ప్రకటన చేయడంతో మార్కెట్లో అనిశ్చితి నెలకొంది. దీంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు పాల్పడ్డారు. ఆర్బీఐ తాజా రూల్స్ నేపథ్యంలో బ్యాంకింగ్ షేర్లు ఒత్తిడికి గురయ్యాయి. ఈ కారణాలన్నింటి వల్ల మార్కెట్ నష్టాలకు గురైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, యాక్సిస్, ఎస్బీఐ బ్యాంకులు, లార్సెన్ అండ్ టర్బో, అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా వంటి సంస్థలు భారీగా నష్టపోయాయి. మరోవైపు రూపాయి విలువ బలపడింది. డాలర్‌తో మారకం విలువ 157 పైసలు కోలుకుని 93.13 వద్ద కొనసాగుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ క్రూడాయిల్ ధర 108 డాలర్లకు చేరింది. అలాగే, ఔన్స్ బంగారం ధర 4616 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# మళ్లీ పుంజుకున్న బంగారం ధరలు..

గత కొన్ని రోజులుగా భారీగా తగ్గుతూ వచ్చిన బంగారం ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే బంగారం, వెండి ధరలు మళ్లీ పుంజుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అమెరికన్ డాలర్ విలువ తగ్గడం వల్ల పెట్టుబడిదారులు బంగారం వైపు మొగ్గు చూపడంతో బంగారం ధరల్లో ఒక్కసారిగా భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. డాలర్ తగ్గితే సాధారణంగా బంగారం ధరలు పెరుగుతాయి. ఈ క్రమంలో బుధవారం ఒక్కరోజే తులం బంగారంపై ఏకంగా రూ.3వేలకుపైగా పెరిగింది. ఈ భారీ హెచ్చుతగ్గుల తర్వాత ప్రస్తుతం భారత్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు సుమారు రూ.1,52,960 కు చేరుకుంది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర చూసుకుంటే తులం 1,40,200 వద్ద స్థిరపడింది. ఇక 18 క్యారెట్ల బంగారం ధర రూ. 1,14,710 కొనసాగుతోంది. హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో



బంగారం, వెండి ధరలు ఇలా గురువారం ఉదయం 6గంటలకు హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,52,960గా ఉంది. నిన్న ఈ ధర రూ.1,52,950 వద్ద కొనసాగుతోంది. అటు 22 క్యారెట్ల ధర ఇవాళ రూ.1,40,210 వద్ద ఉండగా.. నిన్న రూ.1,40,200 వద్ద ట్రేడవుతోంది.

ఇక ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,52,960 వద్ద ట్రేడవుతోండగా.. నిన్న రూ.1,52,950గా ఉంది. ఇక 22 క్యారెట్ల రేటు రూ.1,40,210 వద్ద కొనసాగుతోంది. ఇక బెంగళూరులో 10 గ్రాముల 24 క్యారెట్ల ప్యూర్ బంగారం ధర రూ.1,52,960 వద్ద కొనసాగుతోంది. నిన్న ఈ ధర రూ.1,52,950గా ఉంది. అటు 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,40,210గా ఉండగా.. నిన్న రూ.1,40,200గా ఉంది. అటు చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,53,280గా ఉండగా.. ఇక 22 క్యారెట్ల ధర రూ.1,40,510 వద్ద ట్రేడవుతుండగా.. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,53,110 వద్ద కొనసాగుతుండగా.. 22 క్యారెట్ల రేటు రూ.1,40,360 వద్ద ట్రేడవుతోంది.

# పవర్ గ్రిడ్ నూతన సిఎండిగా వంశీ రామమోహన్

గుర్‌గావ్

ప్రభుత్వ రంగ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ దిగ్గజ కంపెనీ పవర్‌గ్రిడ్ నూతన ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి)గా వంశీ రామమోహన్ బుర్రా బాధ్యతలు స్వీకరించారు. గతంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్)గా పనిచేసిన ఆయనకు పవర్ ట్రాన్స్‌మిషన్, టెలికాం రంగాల్లో 33 ఏళ్లకు పైగా విశేష అనుభవం ఉంది. 1993లో పవర్‌గ్రిడ్‌లో చేరిన వంశీ రామ మోహన్ సంస్థ నియంత్రణ వ్యూహాలను రూపొందించడంలో, టెలికాం వ్యాపార విస్తరణలో ఆయన కీలక పాత్ర పోషించారు. పవర్‌గ్రిడ్ ప్రయాణంలో మొదటి నుండి భాగస్వామిగా ఉన్న వంశీ రామమోహన్ నాయకత్వం, సంస్థను డిజిటల్, ఇంధన రంగాల్లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని ఆ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేశాయి



# అభిషేక్ శర్మ నంబర్ వన్

**-ఇషాన్ కిషన్ నంబర్ టూ**
**-టాప్ పది స్థానల్లో నలుగురు భారతీయులు !**
**-ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ విడుదల..**


అంతర్జాతీయ క్రికెట్ మండలి టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌ను విడుదల చేసింది. టాప్ రెండు స్థానాలను భారత యువ సంచలనాలు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ కైవసం చేసుకున్నారు. అభిషేక్ శర్మ ఏకంగా 875 రేటింగ్ పాయింట్లతో నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకోగా.. అగ్రస్థానానికి కేవలం నాలుగు పాయింట్ల దూరంలో ఉన్న వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ 871 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. భారత క్రికెట్ చరిత్రలో ఇలా ఇద్దరు ఆటగాళ్లు టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో వరుసగా తొలి రెండు స్థానాలను ఆక్రమించడం ఇదే తొలిసారి. టాప్ 10 స్థానంలో మొత్తం నలుగురు భారతీయులు ఉండటం మరో విశేషం. యువ సంచలనం తిలక్ వర్మ ఆరో స్థానంలో నిలవగా.. భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఏడో స్థానంలో కొనసాగుతూ అంతర్జాతీయ స్థాయిలో భారత ఆధిపత్యాన్ని స్పష్టం చేస్తున్నారు. టాప్ 20 బ్యాటర్ల



జాబితాలో ఇతర దేశాల ఆటగాళ్ల స్థానాల్లో స్వల్ప మార్పులు మాత్రమే చోటుచేసుకున్నాయి. ఇంగ్లండ్ వెటరన్ బ్యాటర్ జోస్ బట్లర్ ఒక స్థానం ఎగబాకి ఎనిమిదో ర్యాంకుకు చేరుకోగా, న్యూజిలాండ్‌కు చెందిన టిమ్ సీఫర్ట్ ఒక స్థానం దిగజారి తొమ్మిదో ర్యాంకుతో సరిపెట్టుకున్నాడు. ఇటీవలే న్యూజిలాండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో అద్భుతంగా రాణించి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కించుకున్న దక్షిణాఫ్రికా ఆటగాడు కోనర్ ఎస్టర్‌హుజెన్ తన ర్యాంకును అమాంతం మెరుగుపరుచుకున్నాడు. గతంలో టాప్ 100 వెలుపల ఉన్న అతను ఏకంగా 39వ స్థానానికి దూసుకురావడం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అదే సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన కనబరిచిన కివీస్ ఆటగాడు టిమ్ రాబిన్సన్ 32వ స్థానానికి చేరుకున్నాడు. బౌలింగ్ విభాగం విషయానికి వస్తే ఆఫ్ఘనిస్తాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ అగ్రస్థానాన్ని పదిలం చేసుకున్నాడు. భారత అగ్రశ్రేణి స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి రెండో స్థానంలో నిలవగా, స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఐదో ర్యాంకులో కొనసాగుతున్నాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా అగ్రస్థానంలో ఆధిపత్యం చెలాయిస్తుండగా.. భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా రెండో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో విశేషంగా రాణించిన దక్షిణాఫ్రికా బౌలర్లు గెరాల్డ్ కోయెట్జీ, ఒట్నీల్ బార్ట్‌మాన్ లాంటి అద్భుత ఆటగాళ్లు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో భారీగా ఎగబాకారు. రానున్న ఇంగ్లండ్ సిరీస్‌కు ముందు టీమిండియా ఆటగాళ్లు మూడు విభాగాల్లోనూ సత్తా చాటుతుండటం భారత క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహం నింపుతోంది.

# లక్నో స్టేడియంలో ఫ్యాన్స్ వీరంగం..

ఐపీఎల్ 2026లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్ వర్సెస్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల మధ్య ఉత్కంఠభరితంగా సాగుతున్న మ్యాచ్‌ను చూసేందుకు వచ్చిన అభిమానుల మధ్య చిన్నపాటి వాగ్వాదం చివరకు పెద్ద గొడవకు దారితీసింది. స్టేడియం లోపలే అభిమానులు ఒకరిపై ఒకరు పిడిగుద్దులు కురిపించుకున్నారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో దావానలంలా వ్యాపించాయి. ఘర్షణకు గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. గొడవ ముదరడంతో వెంటనే స్పందించిన పోలీసులు జోక్యం చేసుకుని ఇరు వర్గాలను విడదీశారు. మ్యాచ్ విషయానికి వస్తే, మొదట బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ జట్టు నిర్ణీత ఓవర్లలో





కేవలం 141 పరుగులకే కుప్పకూలింది. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టును ట్రిస్టన్ స్టబ్స్, సమీర్ రిజ్వీ తమ అద్భుత బ్యాటింగ్‌తో విజయతీరాలకు చేర్చారు. ఇంకా రెండు ఓవర్ల సమయం మిగిలి ఉండగానే ఢిల్లీ జట్టు విజయాన్ని అందుకుంది.

# స్పోర్ట్స్

## వైభవ్ సూర్యవంశీ భారీ రికార్డ్..



రాజస్థాన్ రాయల్స్ తరపున బరిలోకి దిగిన వైభవ్ సూర్యవంశీ, బలమైన చెన్నై సూపర్ కింగ్స్ బౌలింగ్‌ను చీల్చి చెండాడాడు. కేవలం 17 బంతుల్లో 52 పరుగులు చేసిన ఈ యువ కెరటం, అందులో కేవలం 15 బంతుల్లోనే అర్ధశతకాన్ని పూర్తి చేసి ఐపీఎల్ రికార్డులను సమం చేశాడు. మైదానం నలుమూలలా అతను బాదిన షాట్లు చూస్తుంటే, ఒక అనుభవజ్ఞుడైన అంతర్జాతీయ ఆటగాడు ఆడుతున్నట్లు అనిపించిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వైభవ్ అద్భుత ప్రదర్శన చూసిన పాకిస్థాన్ మాజీ వికెట్ కీపర్ కమ్రాన్ అక్మల్, అతడిని వెంటనే భారత టీ20 జట్టులోకి తీసుకోవాలని సూచించాడు. ఇంత చిన్న వయస్సులో ఇంతటి పరిణతితో ఆడటం అసాధారణమని, ఐపీఎల్ ముగియగానే అతను టీమ్ ఇండియా నీలి రంగు జెర్సీలో కనిపిస్తాడని అక్మల్ జోస్యం చెప్పారు. సరిహద్దుల అవతల నుంచి కూడా వైభవ్ ప్రతిభకు ప్రశంసలు దక్కడం అతని సత్తాకు నిదర్శనం. వైభవ్ సూర్యవంశీలో ఉన్న అతిపెద్ద బలం అతని భయం లేని బ్యాటింగ్ శైలి. లక్ష్యం చిన్నదైనా, పెద్దదైనా ఏమాత్రం తడబడకుండా బౌలర్లపై విరుచుకుపడటమే ఇతని శైలి. యశస్వి జైస్వాల్‌తో కలిసి అతను అందించిన ఓపెనింగ్ భాగస్వామ్యం రాజస్థాన్ జట్టుకు సునాయాస విజయాన్ని అందించింది. కేవలం పరుగులు చేయడమే కాకుండా, మ్యాచ్ పరిస్థితులను బట్టి తన ఆటను మార్చుకోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. పాకిస్థాన్ మాజీ క్రికెటర్ బాసిత్ అలీ వైభవ్ ఆటతీరును సరదాగా ప్రశంసించారు. "ఈ ఒక్క బబ్లూ అందరికంటే భారంగా మారాడు" అంటూ వైభవ్ దూకుడును కొనియాడాడు. అనుభవజ్ఞులైన బౌలర్ల బంతులకు కూడా తన దగ్గర సమాధానం ఉందని వైభవ్ నిరూపించాడు. అతని షాట్ ఎంపిక, మైదానంలో చూపే తెగువ భారత క్రికెట్ భవిష్యత్తుకు శుభసూచకమని నిపుణులు అంటున్నారు. ఏదేమైనా, 15 ఏళ్లకే భారత జట్టులో చోటు సంపాదిస్తే, అది క్రికెట్ చరిత్రలోనే ఒక అద్భుత ఘట్టంగా నిలిచిపోతుంది.